బుధవారం
WEDNESDAY
4.12.2024
సంచిక: 105
సంపుటి: 16
వెల రూ.6.00
పేజీలు: 8
PAGES: 8
హైదరాబాద్
HYDERABAD

సమగ్ర కథనాలు, ఈ పేపర్ కోసం స్కాన్ చేయండి

ఋషి

ధర్మం కోసం అక్షర తపస్సు తెలుగు దినపత్రిక

శ్రీకృష్ణుడి మాట

మరణం అనివార్యం. పుట్టిన ప్రతి ప్రాణి గిట్టక తప్పదు. ఎవరూ అమరులు కాదు.

ముహూర్తం

04 డిసెంబర్ 2024 - బుధవారం శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:35 సూర్యాస్తమయం - సా. 5:36 తిథి తదియ మ. 1:08 వరకు సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం పూర్వాషాఢ సా. 5:04 వరకు యోగం గండ మ. 1:50 వరకు కరణం గరజి మ. 1:08 వరకు వనిజ రా. 1:000 వరకు వర్జ్యం రా. 1:18 నుండి రా. 2:55 వరకు దుర్ముహూర్తం ఉ. 11:44 నుండి మ. 12:28 వరకు రాహుకాలం మ. 12:06 నుండి మ. 1:29 వరకు యమగండం ఉ. 7:58 నుండి ఉ. 9:21 వరకు గుళికాకాలం ఉ. 10:43 నుండి మ. 12:06 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:59 నుండి తె. 5:47 వరకు అమృత ఘడియలు మ. 12:20 నుండ మ. 1:58 వరకు అభిజిత్ ముహూర్తం లేదు
గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published From HYDERABAD || www.rhushinews.com facebook: rhushinews twitter: rhushinews instagram: rhushinews

కొత్త చట్టాలతో.. ప్రజలకు న్యాయం

రాజ్యాంగ ఆశయాల దిశగా అడుగులు

ఉగ్రవాదులు, ఉగ్ర సంస్థలు తప్పించుకోలేవు

బ్రిటిష్ భావజాలం నుంచి మనం బయటపడాలి

మనల్ని లొంగదీసుకునేందుకు ఆనాటి చట్టాలు

బీఎన్ఎస్, నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియమ్ చట్టం జాతికి అంకితం

ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి

రాజ్యాంగ విలువలు, ప్రాముఖ్యతకు లోటు రాకుండా భారతీయ న్యాయ సంహిత రూపొందించాం.రాజ్యాంగంలో పొందు పరిచిన ఆశయాల దిశగా అడుగులు వేసేందుకు కొత్త క్రిమినల్ చట్టాలను ఉపయోగపడుతాయి. కొత్త చట్టాలతో ప్రజలందరికీ న్యాయం జరుగుతుంది.
-ప్రధాని నరేంద్ర మోదీ

చండీఘడ్, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి): నూతనంగా తీసుకువచ్చిన మూడు నేర చట్టాలను ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు. మంగళవారం చండీఘడ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ ప్రకటన చేశారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియమ్ చట్టాలను జూలై ఒకటో తేదీ నుంచి అమలు చేస్తున్న విషయం తెలిసిందే. బ్రిటీష్ కాలం నాటి ఇండియన్ పీనల్ కోడ్, కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ అండ్ ద ఇండియన్ ఎవిడెన్స్ యాక్టు చట్టాలను ఇటీవల కేంద్ర సర్కారు రద్దు చేసింది. కొత్త మూడు న్యాయ చట్టాలను వంద శాతం అమలు చేసిన నగరంగా చండీఘడ్ నిలిచింది. ఈ నేపథ్యంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ విలువలు, ప్రాముఖ్యతకు లోటు రాకుండా భారతీయ న్యాయ సంహిత రూపొందించినట్లు ప్రధాని తెలిపారు. రాజ్యాంగంలో పొందుపరిచిన ఆశయాల దిశగా అడుగులు వేసేందుకు కొత్త క్రిమినల్ చట్టాలను ఉపయోగపడుతాయన్నారు. కొత్త చట్టాలతో ప్రజలందరికీ న్యాయం జరుగుతుందన్నారు. డిజిటల్ ఆధారాలు, తరువాయి 2 వ పేజీలో...

భద్రాచలం ఐటీడీఏ పీవో, ఐఏఎస్ రాహుల్ ప్రత్యేక చొరవతో సర్కారు బడి విద్యార్థుల కోసం రూపొందించిన స్టూడెంట్ వర్క్ షీట్స్ పుస్తకాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం ఐటీడీఏ పీవో రాహుల్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఈ వర్క్ షీట్స్ కార్పొరేట్ స్కూళ్లలో లభించే పుస్తకాల స్థాయిలో ఉన్నాయని, వీటితో విద్యార్థులు మరింత నేర్చుకొనేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. ఈ వర్క్ షీట్స్ ప్రయోగశాలలా ఉన్నాయని, విద్యార్థుల మేధోశక్తికి పరీక్ష పెడతాయని వెల్లడించారు. మొత్తం 5,300 మందికి 11,500 పుస్తకాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ రేపే

- రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శ్రీకారం
- రాష్ట్రంలో 4 లక్షల 50 వేల ఇళ్ల మంజూరు
- ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు
- 6 నుంచి గ్రామాల్లో అధికారుల పర్యటన
- లబ్ధిదారులను గుర్తించనున్న అధికారులు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటన

2

రద్దీ రోజుల్లో వీఐపీ దర్శనాలు రద్దు

శ్రీశైలం దేవస్థానం కీలక నిర్ణయం

4

ఏపీకి మరో తుఫాన్ ముప్పు

రెండోవారంలో వాయుగుండం ఏర్పడే చాన్స్

వాతావరణశాఖ వెల్లడి

4

గ్లోబల్ సిటీగా హైదరాబాద్

ఎవరెన్ని కుట్రలు పన్నినా అభివృద్ధి ఆగదు.. నిధులు తెస్తరా? గుజరాత్‌కు వలసపోతారా?

- నిద్రలు చేయడం మాని నిధులు తీసుకురండి
- కిషన్‌రెడ్డిని నిలదీసిన సీఎం రేవంత్ రెడ్డి
- కేంద్రం నుండి రూ.10 వేల కోట్లు తీసుకురండి
- మూసీ నిర్వాసితులకు అండగా ఉన్నాం
- పదేళ్లు తెలంగాణను భ్రష్టు పట్టించిన కేసీఆర్
- అప్పుల ఊబిలోకి నెట్టేసిన ఘనత కేసీఆర్‌దే
- రైజింగ్ ఉత్సవాలలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి): హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మార్చాలనేది తమ ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం మాయమాటలు చెప్పి తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. హైదరాబాద్ నగర సుందరీకరణకు ప్రత్యేక నిధులు కేటాయించి, నగరానికి కావలసిన మౌలిక సదుపాయాలపై తాము ప్రత్యేక దృష్టి సారించామన్నారు. హైదరాబాద్ లోని ఎన్టీఆర్ మార్గ్ వద్ద గల హెచ్ఎండీఏ గ్రౌండ్స్ లో హైదరాబాద్ రైజింగ్ ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్న సందర్భంగా ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా రైజింగ్ ఉత్సవాలను నిర్వహించారు. ఈ ఉత్సవాలలో భాగంగా తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. సీఎం వెంట డిప్యూటీ సీఎం తరువాయి 2 వ పేజీలో...

2

చిన్మయ్ కృష్ణదాస్ బెయిల్ పిటిషన్ వాయిదా

కోర్టు సమీప ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలు పెట్రోలింగ్

ఏక్‌నాథ్ షిండేకు డిప్యూటీ సీఎం!

5న ప్రమాణస్వీకారం

2

త్వరలోనే 'పంచాయతీ' నగరా

పంచాయతీరాజ్ చట్టసవరణపై ప్రభుత్వం కసరత్తు

రిజర్వేషన్ల కాలపరిమితిలో మార్పు!.. కలెక్టర్, ఉపసర్పంచ్ అధికారాలకు కోత!

హైదరాబాద్, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి): తెలంగాణలో త్వరలోనే పంచాయతీ ఎన్నికలకు నగరా మోగనుంది. అయితే అది బీసీ కులగణన తర్వాతే. అందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. తెలంగాణలో 12,992 పంచాయతీలు ఉన్నాయి. సర్పంచ్ కాల పరిమితి ముగియడంతో స్పెషల్ ఆఫీసర్ పాలనలో పంచాయతీలు నడుస్తున్నాయి. బీసీ రిజర్వేషన్ల పెంచుతామని కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల హామీ ఇవ్వడంతో అందుకు తగ్గట్టుగా ఇప్పుడు బీసీ కుల గణన జరుగుతోంది. ఈ సర్వే తర్వాత బీసీ జనాభా దామాష పద్ధతిన పంచాయతీలు బీసీలకు రిజర్వే చేయనున్నారు. అయితే ఇందు కోసం పంచాయతీ రాజ్ బిల్లులో మార్పులు చేయాల్సి ఉంది. అందుకు తగ్గట్టుగా వచ్చే తరువాయి 2 వ పేజీలో...

హరీశ్‌పై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు

లక్ష తప్పుడు కేసులు పెట్టించినా తగ్గనన్న మాజీమంత్రి

3

పుష్ప-2 టికెట్ ధరల పెంపుపై నివేదిక!

మైత్రి మూవీస్‌కు హైకోర్టు ఆదేశాలు

3

ఋషి దినపత్రిక కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా పనిచేయుటకు మండలాల వారీగా విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్న యువకులు 9666711515 నంబర్‌కు వాట్సాప్ ద్వారా,
rhushinews@gmail.com
మెయిల్‌కు బయో డేటా పంపగలరు.

కొత్త చట్టాలతో.. ప్రజలకు న్యాయం

మొదటి పేజీ తరువాయి

టెక్నాలజీ ఏకీకరణతో.. ఉగ్రవాదంపై పోరాడేందుకు సులువు అవుతుందని, ఉగ్రవాదులు.. ఉగ్ర సంస్థలు తప్పించుకోలేని రీతిలో కొత్త చట్టాలు పకడ్బందీగా ఉన్నట్లు ప్రధాని తెలిపారు. గతంలో ఉన్న క్రిమినల్ చట్టాలు భారతీయుల్ని శిక్షించాలన్న ఉద్దేశంతో ఉన్నాయని, వాళ్లను బానిసలుగా చూసే విధంగా చట్టాలను ఉన్నట్లు చెప్పారు. బానిసల కోసం చట్టాలను మనం ఎందుకు అమలు చేయాలని ప్రధాని ప్రశ్నించారు. బ్రిటీష్ కాలం నాటి మైండ్‌సెట్ నుంచి దేశ ప్రజలు బయటపడాలన్నారు.

త్వరలోనే 'పంచాయతీ' నగరా

మొదటి పేజీ తరువాయి

శాసనసభ సమావేశాల్లో పంచాయతీ రాజ్ బిల్లులో సవరణలు చేయనున్నారు. కేవలం బీసీ రిజర్వేషన్ల కోసమే కాకుండా మరి కొన్ని మార్పులు ఉండే అవకాశం ఉందని పంచాయతీ రాజ శాఖ అధికారులు చెబుతున్నారు. బీఆర్ఎస్ సర్కార్ హయంలో అంటే 2018లో పంచాయతీ రాజ్ బిల్లు తీసుకువచ్చింది. అందులో పదేళ్ల కోమారు అంటే రెండు టర్మ్‌ల తర్వాతే రిజర్వేషన్ల మార్పుపై నిర్ణయం తీసుకునేలా చట్టంలో పేర్కొంది. అంతకు మునుపు ప్రతీ ఐదేళ్లకు రిజర్వేషన్లు మార్పు ఉండేది. కాని కేసీఆర్ హయంలో దాన్ని పదేళ్లకు చేసింది. ప్రతీ ఐదేళ్లకు రిజర్వేషన్ల మార్పు వల్ల ఎన్నికలు ఆలస్యం అవుతున్నాయని, అభివృద్ధి కుంటుపడుతుందని అప్పటి ప్రభుత్వం చెప్పింది. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ సర్కార్ దీన్ని ఐదేళ్లకు కుదించేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు బిల్లులో మార్పులు తెచ్చేందుకు పంచాయతీ రాజ్ శాఖ సిద్ధమవుతోంది. ప్రస్తుత పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం సర్పంచ్‌లను సస్పెండ్ చేసే అధికారం కలెక్టర్లకు ఉంది. అయితే సర్పంచ్‌లు ప్రజల చేత ఎన్నుకోబడిన వారు. వారిని తొలగించే అధికారం కలెక్టర్లకు కట్టబెట్టడంపై విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా సర్పంచ్‌లు దీన్ని వ్యతిరేకించారు. ప్రజా ప్రతినిధులు ఈ అధికారాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందుకు రేవంత్ సర్కార్ సానుకూలంగా స్పందించింది. వచ్చే బిల్లులో ఈ మేరకు కలెక్టర్ అధికారాలకు కోత పడనుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉప సర్పంచ్‌లకు చెక్ పవర్ కట్టబెట్టింది. దీంతో పంచాయతీలో సర్పంచ్ ఏ పని చేయాలన్నా ఉప సర్పంచి సంతకం పెడితేనే నిధులు విడుదల అయ్యే పరిస్థితి. దీంతో చాలా పంచాయతీల్లో సర్పంచ్ ఓ పార్టీ వ్యక్తి అయితే, ఉప సర్పంచ్ మరో పార్టీ వ్యక్తి ఎన్నికవడం జరిగింది. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ ఆ పంచాయతీ అభివృద్ధి కుంటుపడే పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే అప్పటి ప్రభుత్వం ఉపసర్పంచ్‌కు చెక్ పవర్ ఇవ్వడం ద్వారా సర్పంచ్ అవినీతికి పాల్పడకుండా ఉంటారన్న ఉద్దేశాన్ని వెలిబుచ్చింది. అయితే దీనిపై సర్పంచ్లు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. సర్పంచ్‌తో సమానంగా ఉప సర్పంచ్‌కు చెక్ పవర్ ఇస్తే తమ పదవికి విలువ ఏంటని పార్టీ వేదికలపైన ప్రశ్నించిన సందర్భాలున్నాయి. వచ్చే బిల్లులో ఉప సర్పంచ్లకు చెక్ పవర్ రద్దు చేసే దిశగా పంచాయతీ రాజ్ బిల్లులో మార్పులున్నాయి. ఉప సర్పంచ్‌కు బదులు పంచాయతీ కార్యదర్శికి ఆ అధికారం ఇచ్చే అవకాశం ఉంది.పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలంటే ఇద్దరు పిల్లలు మాత్రమే ఉండాలి. ఇద్దరు కన్నా ఎక్కువ మంది పిల్లలు ఉంటే వారు పోటీకి అనర్హులు. అయితే మున్సిపల్ చట్టం ప్రకారం మున్సిపాలిటీల్లో కార్పోరేటర్లకు, మున్సిపల్ ఛైర్మన్లకు ఇలాంటి నిబంధన లేదు. అదే రీతిలో కార్పోరేషన్లలో కార్పోరేటర్లకు, మేయర్ ఎన్నికకు ఈ నిబంధన లేదు. కేవలం పంచాయతీ రాజ్ చట్టంలోనే పేర్కొనడంపై విమర్శలు వచ్చాయి. దీన్ని మార్చాలన్న డిమాండ్ ఉంది. ఈ దఫా అసెంబ్లీసమావేశాల్లో ఈ దిశగా మార్పు ఉండే అవకాశం ఉంది. సర్పంచ్‌లకు ముగ్గురు పిల్లలు ఉంటే పోటీ చేయరాదన్న నిబంధన తొలగించి పోటీకి వెసులుబాటు కల్పించవచ్చు.ప్రతీ మండలంలో జనాభాను బట్టి ఎంపీటీసీ స్థానాలు ఉంటాయి. ప్రతీ ఐదు వేలమందికి ఓ ఎంపీటీసీ ఉండే అవకాశం ఉంది. అయితే మారిన జనాభా నిష్పత్తిని బట్టి ఎంపీటీసీల సంఖ్య పెరగలేదు. తెలంగాణలో అత్యధిక సంఖ్యలో ఉన్న మండలాలు ఉన్నాయి. ఐదు కన్నా తక్కువ మంది ఎంపీటీసీలున్న మండలాలు ఉన్నాయి. అత్యధికంగా ముత్యంపేట (22 ఎంపీటీసీలు), పెద్దపల్లి (21 ఎంపీటీసీలు) నాగర్ కర్నూల్ (20 ఎంపీటీసీలు), భద్రాచలం (20 ఎంపీటీసీలు) ఉన్నారు. అతి తక్కువగా నాగంగాపురం (4 ఎంపీటీసీలు) వంగర (4 ఎంపీటీసీలు), పస్రి (5 ఎంపీటీసీలు), తాడేపల్లి (5 ఎంపీటీసీలు),అదిలాబాద్ (5 ఎంపీటీసీలు) పాద్మానగర్ (5 ఎంపీటీసీలు) ఉన్నారు. అయితే ప్రతీ మండలానికి కనీసం ఐదుగురు ఎంపీటీసీలు ఉండేలా పంచాయత్ రాజ్ చట్టంలో మార్పులు తీసుకురానున్నారు.

చిన్మయ్ బెయిల్ పిటిషన్ వాయిదా

ఢాకా, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి): బంగ్లాదేశ్‌లో అరెస్టు అయిన చిన్మయ్ కృష్ణదాస్ బ్రహ్మచారి బెయిల్ పిటిషన్ వాయిదా పడింది. ఆయనకు బెయిల్ ఇప్పించేందుకు డిఫెన్స్ లాయర్ ఎవరు ముందుకు రాలేదు. దీంతో చిట్టగాంగ్ కోర్టు ఆయన బెయిల్ పిటీషన్‌పై విచారణను వచ్చే ఏడాది జనవరి రెండో తేదీకి వాయిదా వేసింది. కోర్టు రూమ్‌కు ఉదయం 11 గంటలకు డిఫెన్స్ లాయర్ హాజరు కాలేదని, దీంతో బెయిల్‌ను వాయిదా వేస్తున్నట్లు చిట్టగాంగ్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి సైఫుల్ ఇస్లామ్ ఆదేశాలు ఇచ్చారు. కృష్ణదాస్ తరపున వాదించేందుకు సిద్ధమైన లాయర్‌ను ఇస్లామిస్టులు చితకబాదినట్లు ఇస్కాన్ ఓ ప్రకనటలో తెలిపింది. ఆ లాయర్ ప్రస్తుతం ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉన్నట్లు పేర్కొన్నది. బెయిల్ విచారణకు హాజరు అవుతారన్న నేపథ్యంలో సుమారు 70 మంది హిందూ లాయర్లపై కేసులు పెట్టినట్లు బంగ్లాదేశ్ సమ్మిళిత సనాతని జాగ్రన్ జోట్ తెలిపింది. కృష్ణదాస్‌ను డిఫెండ్ చేస్తున్న లాయర్లపై దాడి జరుగుతున్నట్లు ఆ సంస్థ ఆరోపించింది. డిఫెన్స్ లాయర్ ఎవరూ హాజరుకాలేదని చిట్టగాంగ్ మెట్రోపాలిటన్ పోలీసు అదనపు డిప్యూటీ కమీషనర్ మోఫిజుర్ రెహ్మాన్ మీడియాకు వెల్లడించారు. బెయిల్ విచారణ సందర్భంగా కోర్టు ఆవరణలో సెక్యూర్టీని పెంచారు. కోర్టు సమీప ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలు పెట్రోలింగ్ నిర్వహించాయి.

ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ రేపే

- రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శ్రీకారం
- రాష్ట్రంలో 4 లక్షల 50 వేల ఇళ్ల మంజూరు
- ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు
- 6 నుంచి గ్రామాల్లో అధికారుల పర్యటన
- లబ్ధిదారులను గుర్తించనున్న అధికారులు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటన

హైదరాబాద్, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో డిసెంబర్ 5న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శ్రీకారం చుట్టబోతున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలంలో మంగళవారం (డిసెంబర్ 03) వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌తో కలిసి ఆయన విస్తృత పర్యటన చేశారు. ఈ సందర్భంగా రూ.3 కోట్ల 62 లక్షల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో 4 లక్షల 50 వేల ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున ఇళ్లను కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 6వ తేదీ నుంచి గ్రామాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, లబ్ధిదారులను గుర్తించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల కుంపటిగా మార్చిందని మండిపడ్డారు. ప్రతి నెల రూ.6 వేల 500 వందల కోట్లు అసలు, వడ్డీ కలిపి చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.రేషన్ కార్డు లేని వారికి ప్రభుత్వం ఇటీవల గుడ్ న్యూస్ చెప్పింది. రేషన్‌కార్డు లేకపోయినా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని స్పష్టం చేసింది. మొదటి విడతలో వీరికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపింది. ఈ విషయాన్ని స్వయంగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గతంలో వెల్లడించారు. రేషన్ కార్డు లేని పేద ప్రజలకు ఇది నిజంగా శుభవార్తనే చెప్పాలి. ఖమ్మం జిల్లా కూసుమంచిలోని క్యాంప్ కార్యాలయంలో గత నెలల జరిగిన నియోజకవర్గ పరిధి సమావేశంలో ఈ ప్రకటన చేశారు. తిరుమలాయపాలెం మండలం కాంగ్రెస్ శ్రేణులు, అధికారుల సంయుక్త సమావేశం నిర్వహించారు. కాగా గతంలో రేషన్ కార్డు లేకపోయినా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని స్పష్టం చేసింది. మొదటి విడతలో వీరికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపింది. ఈ విషయాన్ని స్వయంగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. రేషన్ కార్డు లేని పేద ప్రజలకు ఇది నిజంగా శుభవార్తనే చెప్పాలి. ఖమ్మం జిల్లా కూసుమంచిలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం జరిగిన నియోజకవర్గ పరిధి సమావేశంలో ఈ ప్రకటన చేశారు. తిరుమలాయపాలెం మండలం కాంగ్రెస్ శ్రేణులు, అధికారుల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మొదటి విడతలో పేదలు, నిరుపేదల విభాగాలుగా పరిశీలించి ఇళ్లు మంజూరు చేయాలని నిర్ణయించామని తెలిపారు. రెండో విడత నుంచి మాత్రం రేషన్‌కార్డే ప్రామాణికంగా తీసుకుంటామని స్పష్టం చేశారు. త్వరలోనే రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు.

80 శాతం ఓసీ ప్రొఫెసర్లే

- ఎస్సీ, ఎస్టీ అధ్యాపకులు చాలా తక్కువ.. కొన్ని చోట్ల అసలే లేరు
- అన్ని ఐఐటీ, ఐఐఎంలలో ఇదే పరిస్థితి.. ఆర్టీఐ ద్వారా వెలుగులోకి..

న్యూఢిల్లీ, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)ల అధ్యాపకులలో ఎస్సి, ఎస్టీ వర్గాలకు చెందిన వారు చాలా తక్కువ శాతం ఉన్నారు. వీటిల్లో దాదాపు 80 శాతానికి పైగా జనరల్ కేటగిరీకి చెందిన అధ్యాపకులే బోధిస్తున్నారని ఆర్టీఐ (సమాచార హక్కు) ద్వారా వెల్లడ్డైంది. రెండు ఐఐటీలు, మూడు ఐఐఎంల్లో అయితే జనరల్ కేటగిరీ వాటా 90శాతానికి మించిపోయింది. మరో ఆరు ఐఐటీల్లో, నాలుగు ఐఐఎంల్లో జనరల్ వాటా 80%-%90 శాతం మధ్య వుందని సమాచార హక్కు ద్వారా అందిన సమాచారం తెలియజేస్తోంది. ఈ ఏడాది సెప్టెంబర్ వరకు ఐఐటీ, ఐఐఎంల సంస్థల నుంచి తీసుకున్న సమాచారం మేరకు ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఐఐటీ, ఐఐఎంల తోపాటు ఇతర విద్యా సంస్థల్లో అధ్యాపకుల పోస్టుల కోసం కేంద్రం రిజర్వేషన్లను కల్పించింది. ఓబిసిలకు 27 శాతం, ఎస్సిలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం మేర రిజర్వేషన్లు ఇచ్చారు. వెనుకబడిన తరగతుల వారికి కేంద్రం అవకాశాలు కల్పించినా ఆచరణలో అవి అమలు కావడం లేదు. ఇండోర్ ఐఐఎంలో 109 పోస్టుల్లో 106 పోస్టులు జనరల్ కేటగిరీలోని వారితోనే నడుస్తున్నాయి. ఈ ఐఐఎంలో ఎస్సి, ఎస్టీలకు చెందిన అధ్యాపకులే లేరని ఆర్టీఐ తెలిపింది. ఇక ఉదరుపూర్‌లో కూడా 90 శాతానికి పైగానే, ఐఐఎం లక్నోలో కూడా 95 శాతానికి పైగా జనరల్ కేటగిరీకి చెందినవారే అధ్యాపకులుగా ఉన్నారు. ఆరు ఐఐఎంలను పరిశీలించిన్లట్లైతే ఒక్క ఎస్టీ కేటగిరికి చెందిన అధ్యాపకులు కూడా లేరు. బెంగళూరు ఐఐఎంలో 85 శాతానికిపైగా జనరల్ కేటగిరీ అధ్యాపకులు ఉన్నారు. అందుకే రిజర్వేషన్లకు తగ్గట్టుగా అధ్యాపకుల్ని నియమించాలని అక్కడ నిరసనలు జరిగాయి. ఐటి ముంబయి, ఐఐటి ఖరగ్‌పూర్‌లలో 700కి పైగా అధ్యాపక పోస్టుల్లో 90 శాతం పదవుల్లో జనరల్ కేటగిరిగికి చెందిన వ్యక్తులే ఉన్నారు. మండీ, గాంధీనగర్, కాన్పూర్, గౌహతి, ధ్లీ ఐఐటీల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. 80%-%90 శాతం మేర జనరల్ కేటగిరీ వారే అధ్యాపకులుగా ఇక్కడ ఉన్నారు. మొత్తంగా 13 ఐఐఎంల్లో 82.8 శాతం మంది అధ్యాపకులు జనరల్ కేటగిరీ వారు వుండగా, కేవలం 5 శాతం ఎస్సి, ఒక శాతం ఎస్టి, 9.6 శాతం మంది ఓబిసి, ఆర్థికంగా బలహీనపడిన వర్గాలు (ఇబిసి), వికలాంగుల కోటాలకు చెందినవారు అధ్యాపకులుగా ఉన్నారు. 1 ఐఐటీలో 80 శాతం జనరల్ కేటగిరీ, 6 శాతం ఎస్సి, 1.6 శాతం ఎస్టి, 11.2 శాతం ఓబిసి, ఇబిసి, వికాలాంగుల కోటాలకు చెందిన అధ్యాపకులు ఉన్నారు. మొత్తంగా ఐఐటీల్లో గానీ, ఐఐఎంల్లో గానీ ఇంచుమించుగా ఇదే గణాంకాలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఐఐటి, ఐఐఎంలన్నింటిలో ఇదే పరిస్థితి నెలకొందని కూడా చెప్పలేమని ఆర్టీఐ పేర్కొంది. పాట్నా ఐఐటి అధ్యాపకుల్లో 38 శాతం ఓబిసి, ఎస్సీలు 22 శాతం, ఎస్టీలు 13 శాతం, జనరల్ కేటగిరీ 12 శాతం మందే ఉన్నారు. భిలారు, ఇండోర్ ఐఐటీల్లో 50 శాతం మంది జనరల్ కేటగిరీ అధ్యాపకులు ఉన్నారు. జమ్మూలో 51 శాతం జనరల్ కేటగిరీ, 19 శాతం ఎస్సి, 5 శాతం ఎస్టి, 23 శాతం ఓబిసి, 2 శాతం ఇతర కేటగిరీలకు చెందిన వారు అధ్యాపకులుగా ఉన్నారు. ఏడు ఐఐఎంల్లో 256 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆర్టీఐ డేటా తెలిపింది. ఈ పోస్టుల్లో ఓబిసి కేటగిరీకి చెందినవి 88, 54 ఎస్సి, 30 ఎస్టి కేటగిరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక ఐఐటీల్లో 1,557 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 451 ఓబిసి, 234 ఎస్సి,, 129 ఎస్టి పోస్టులు ఉన్నాయని ఆర్టీఐ తెలిపింది.

షిండేకు డిప్యూటీ సీఎం.. 5న ప్రమాణస్వీకారం

ముంబై, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి): మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటు కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీసే ఖాయంగా తెలిసింది. ప్రస్తుతం ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉన్న ఏక్‌నాథ్ షిండే .. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టబోతున్నట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. డిసెంబర్ 5న ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని సదరు వర్గాలు స్పష్టం చేశాయి. అయితే, కేబినెట్ కూర్పు ఇంకా పూర్తి కాని కారణంగా.. ఆ రోజు సీఎం, ఇద్దరు డిప్యూటీ సీఎంలు మాత్రమే ప్రమాణం చేస్తారని సదరు వర్గాలు తెలిపాయి. సీఎంగా ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంలుగా ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్‌ల ప్రమాణ స్వీకారం ఉంటుందని సంబంధిత వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంటోంది. కాగా, ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి భారీ విజయాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. కూటమిలోని బీజేపీకి 132 సీట్లు, షిండే సేనకు 57, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి 41 సీట్లు దక్కాయి. ఈ నేపథ్యంలో అత్యధిక సీట్లు సాధించిన బీజేపీనే ఈసారి సీఎం పదవి చేపట్టబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం డిప్యూటీ సీఎంగా ఉన్న బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీసే మహా తదుపరి ముఖ్యమంత్రి కావడం దాదాపు ఖాయమైనట్లు సమాచారం. అయితే, ఇందుకు షిండే వర్గం అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ఈ కారణంగానే మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటులో జాప్యం జరుగుతున్నట్లు కనిపిస్తోంది.

గ్లోబల్ సిటీగా హైదరాబాద్

మొదటి పేజీ తరువాయి

భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మార్చాలనేది తమ ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమన్నారు. గత ప్రభుత్వం మాయమాటలు చెప్పి తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. హైదరాబాద్ నగర సుందరీకరణకు ప్రత్యేక నిధులు కేటాయించి, నగరానికి కావలసిన మౌలిక సదుపాయాలపై తాము ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రపంచం మొత్తం హైదరాబాద్ వైపు చూసేలా మూసీ సుందరీకరణ పేరుతో నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని, ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా అభివృద్ధి విషయంలో తాము వెనుకడుగు వేయబోమన్నారు. హైదరాబాద్ నగరం అంటేనే దేశంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు గల నగరంగా పేరుగాంచిందన్నారు. ఈ నగరం ఎందరో యువకులకు ఉపాధినిస్తుందని, ఏపీ సీఎం చంద్రబాబుతో పాటు ఎందరో నాయకులు, ఐటీ కంపెనీలను హైదరాబాద్ కు తీసుకువచ్చి నగరం అభివృద్ధికి దోహద పడ్డారన్నారు. పిజెఆర్ వల్లే గోదావరి జలాలు నగరానికి వచ్చాయని తెలిపారు. న్యూయార్క్, టోక్యో వంటి నగరాలకు పోటీనిచ్చే సత్తా ఉన్న నగరంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని సీఎం తెలిపారు. ఎన్నో కంపెనీలు ఇక్కడ ఉన్నాయని, ప్రభుత్వానికి 65 శాతం ఆదాయం ఇక్కడి నుండే వస్తుందన్నారు. తెలంగాణ మణిహారంగా రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం సాగిస్తున్నామని, 7 వేల కోట్లతో హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి హోదాలో గల సికింద్రాబాద్ ఎంపీ కిషన్ రెడ్డి, కేంద్రంతో మాట్లాడి ఒక్క రూ.10 వేల కోట్లు తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మూసీ ప్రక్షాళన పేరిట తాము నిర్వాసితులకు అండగా నిలబడుతుంటే, అక్కడికి వెళ్లి నిద్రలు చేయడం మాని కేంద్రం నుండి నిధులు తీసుకురావాల్సిన భాద్యత కిషన్ రెడ్డిపై ఉందన్నారు. ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా కిషన్ రెడ్డి తీసుకు రాలేదని ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి కేంద్రం సహకారం కావాలని, నిధులు తెస్తరా? గుజరాత్ కు వలసపోతారా? మూసీ ప్రక్షాళనకు కేంద్రం నుంచి ఎంత నిధులు తీసుకొస్తవ్ అంటూ సీఎం ప్రశ్నించారు. పదేళ్లు తెలంగాణను భ్రష్ట పట్టించిన కేసీఆర్ ఇప్పుడు ఫామ్ హౌస్ కి పరిమితమై, తాము చేసే అభివృద్ధికి అడ్డు పెట్టడం ఎలా అంటూ ఆలోచిస్తున్నారని సీఎం రేవంత్ అన్నారు. ట్యాంక్ బండ్ నీరు పాలమాదిరిగా మారుస్తామని హామీలిచ్చి, పదేళ్లు అప్పుల ఊబిలోకి నెట్టేసిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందన్నారు. బీఆర్ ఎస్ , బీజేపీలపై చర్చించేందుకు తాను సిద్ధమని, మీ పాలసీ డాక్యుమెంట్ ను తెలంగాణ సమాజానికి చూపించండంటూ సీఎం సవాల్ విసిరారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి తాము కట్టుబడి, వేల కోట్ల రూపాయలతో ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉప ముఖ్యమంత్రి అధ్వర్యంలో మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేస్తామని, అఖిల పక్ష సమావేశం సైతం నిర్వహిస్తామన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ లు ఏమేమి సలహాలు ఇస్తారో ఇవ్వండి అంటూ సీఎం పిలుపునిచ్చారు. రాజధాని గుండా ప్రవహిస్తున్న మూసీ నదికి పునరుజ్జీవం తీసుకువచ్చి మురికి కూపంలో ఉన్న ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతామన్నారు. దాంతో పాటు హైదరాబాదు నగరాన్ని గ్లోబల్ సిటీగా మార్చి పర్యాటకంగా, అందంగా అభివృద్ధి చేసి, మూసిని జీవ నదిగా మార్చాలని తమ ప్రభుత ముందుకుపోతందన్నారు. ఇది ప్రతిపక్షాలకు ఇష్టం లేదని అందుకే అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరం గుండా 55 కిలోమీటర్ల పైగా ప్రవహిస్తున్న మూసీ నదిని పూర్తిగా ప్రక్షాళన చేసి పునరుజ్జీవం తీసుకురావడానికి ప్రజా ప్రభుత్వం ముందుకు పోతున్నది. గోదావరి నీళ్లను తీసుకువచ్చి మూసీలో కలిపి పునరుజ్జీవం తీసుకువస్తామన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి విద్య ఉపాధి అవకాశాలు పెంచుతామన్నారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కదిలించలేమన్న భయంతో కుట్రపూరితంగా బిఆర్ఎస్ తన సోషల్ మీడియా ద్వారా ప్రజలను రెచ్చగొడుతుందన్నారు. హైదరాబాద్ నగరం మీద ప్రేమ, పేదవాళ్లపై అభిమానం ఉంటే సహకరించాల్సింది పోయి కుట్రలు చేయడం మానుకోవాలని బిఆర్ఎస్ నాయకులకు సూచించారు. హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందితే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. ఈ సంవత్సరం బడ్జెట్లో హైదరాబాద్ మహానగర అభివృద్ధి కోసం పది వేల కోట్ల రూపాయలు కేటాయించామని గుర్తు చేశారు. హైదరాబాదులో ట్రాఫిక్ సమస్య లేకుండా వాహనదారులకు సజావుగా ప్రయాణించేందుకు అండర్ పాస్ బ్రిడ్జిలు, ఫ్లై ఓవర్లు నిర్మాణం చేసి రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 400 మురికివాడల్లో నివాసం ఉంటున్న మహిళలను వ్యాపార వేత్తలుగా మార్చడానికి మెప్మా ద్వారా వడ్డీ లేని రుణాలు అందించాలని ప్రజా ప్రభుత్వం ఆలోచన చేస్తుందని చెప్పారు. ఢిల్లీ లాంటి ముప్పు హైదరాబాదు నగరానికి రావొద్దన్న ముందు చూపుతో కాలుష్యం లేని నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. హైదరాబాదు నగరం రాష్ట్రానికే తలమానికం కాదని దేశం గర్వించే విధంగా అభివృద్ధి చేయబోతున్న నగరంగా మారబోతున్నదని అన్నారు. ప్రపంచంలోనే గొప్ప నగరంగా మార్చాలన్న సంకల్పంతో పస రేవంత్ రెడ్డితో సహా మంత్రిమండలి సభ్యులందరం చర్చించి హైదరాబాదుకు కావలసిన అన్ని హంగులను తీసుకురావడానికి ప్రణాళిక బద్ధంగా ముందుకు పోతున్నామని వెల్లడించారు. 10 సంవత్సరాలు పరిపాలన చేసిన టిఆర్ఎస్ పాలకులు హైదరాబాద్ అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. గత ప్రభుత్వాలు చేసిన అభివృద్ధికి రంగులు వేసుకుని పదేళ్లు కాలం వెళ్లదీశారని ఆరోపించారు. పదేళ్లు పాలించి పది పైసలు కూడా నగరం కోసం ఖర్చు చేయని బిఆర్ఎస్ పాలకులకు విమర్శలు చేసే అర్హత లేదన్నారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం తో పాటు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం, నగరవాసులకు ఇప్పుడు అందుతున్న గోదావరి, కృష్ణ, మంజీరా నీటి పథకాలు ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వాలు తెచ్చిన ఫలితమేనని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అనంతరం ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రభుత్వంపై విమర్శలను గుప్పిస్తున్న ప్రతిపక్షం పై మండిపడ్డారు. మూసి పరివాహక ప్రాంతంలో ఒక రోజు నిద్రపోవడం కాదు. అక్కడే గుడిసె వేసుకుని చిరస్థాయిగా జీవించి చూపించాలని అన్నారు. ప్రజలను మభ్య పెట్టడానికి మూసి పరివాహక ప్రాంతంలో ఒక రోజు నిద్రపోయి తర్వాత నుంచి ప్యాలెస్ లో ఉండడం సరికాదన్నారు. కాగా ప్రజా పరిపాలన విజయోత్సవాల్లో భాగంగా పలు ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో రూ.5827 కోట్లతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. గ్రేటర్ పరిధిలో రూ.150 కోట్లతో పలు సుందరీకరణ పనులు, రూ.3,500 కోట్లతో రోడ్ల

భవనాల లే ఔట్ల అనుమతులు మరింత సరళం

బిల్డ్ నౌ యాప్‌ను ప్రారంభించిన ప్రభుత్వం

రియల్ రంగంలో హైదరాబాద్‌దే అగ్రస్థానం

నిబంధనలు సరళతరం చేయాలన్న లక్ష్యం

ఐటిశాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి): భవనాలు, లే అవుట్ల అనుమతులకు 'బిల్డ్ నౌ' పేరుతో కొత్త ఆన్‌లైన్ విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. 'బిల్డ్ నౌ' పేరుతో ఏర్పాటు చేసిన యాప్‌తో పాటు, విధానాన్ని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు మంగళవారం ప్రారంభించారు. సచివాలయంలో బిల్డ్ నౌ అనే యాప్ ను అందుబాటులోకి తీసుకువచ్చారు. పట్టణాభివృద్ధిలో గతంలో లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 60 శాతం మంది జనాభా పట్టణ, నగర ప్రాంతాల్లో ఉంటున్నందున ఈ శాఖ ప్రాధాన్యతపై దృష్టి పెట్టి.. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో వ్యాపారాలకు అనువైన వాతావరణం కల్పిస్తున్నాం. గత ప్రభుత్వం తీసుకొచ్చిన అభివృద్ధి విధానాలను కొనసాగిస్తున్నాం. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నాం. గతంలో ఎన్నడూ లేని విధంగా పథకాలు అమలు చేస్తున్నాం. స్థిరాస్తి రంగంలో ఇప్పటికీ హైదరాబాద్ ప్రథమ స్థానంలో ఉంది. హైదరాబాద్ ప్రజలే గృహ రుణాలు అధికంగా తీసుకుంటున్నారని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం నూతన సమగ్ర భవనాలు , లేఅవుట్ల ఆమోదానికి సంబంధించిన వ్యవస్థ బిల్డ్ నౌ అన్నారు. ఇది అత్యాధునిక ప్రజాపాలన దిశగా ఒక విప్లవాత్మక అడుగు. భారతదేశంలోనే వేగవంతమైన డ్రాయింగ్ స్క్రూట్నీ వ్యవస్థ ఇది నిదర్శనమని అన్నారు. ఈ నూతన వ్యవస్థ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది. అనుమతులు, డ్రాయింగ్ స్క్రూట్నీ ప్రాసెసింగ్ సమయాన్ని వారాల నుంచి నిమిషాలకు తగ్గిస్తుంది. పనితీరులో ఇది ఒక బెంచ్ మార్క్ గా నిలుస్తుందని మంత్రి తెలిపారు. ఈ అత్యాధునిక వ్యవస్థ భవన నిబంధనలు , అనుమతులకు సంబంధించి ప్రజల అవసరాలను వేగంగా తీర్చడంతో పాటు విశ్వసనీయంగా, స్నేహపూర్వకంగా ఉంటుంది. ప్రజలు, నిర్మాణదారుల కోసం శక్తివంతమైన, అధునాతన వ్యవస్థగా అభివర్ణించారు. బహుళ అంతస్తుల భవనాలను కూడా 5 నిమిషాల్లో ప్రాసెస్ చేయగల వేగంతమైన స్క్రూట్నీ ఇంటిన్ ఇది. ప్రజలు పలు విభాగాలకు వెళ్లడం , వివిధ పోర్టల్స్ మారే అవసరం లేకుండా అనుమతి ప్రక్రియ అంతా ఒకే చోట పూర్తి చేయగల ఏకీకృత సింగిల్ విండో ఇంటర్ పీస్ ఇదని మంత్రి వివరించారు. ప్రజలు తమ భవనాలను నిర్మాణానికి ముంది వాస్తవికంగా అగ్మెంటెడ్ రియాలిటీ 3డీ విజువలైజేషన్ ద్వారా చూడొచ్చు. భవన నిబంధనలపై తక్షణం, కచ్చితమైన మార్గదర్శకాలను ఈ ంఎ ఆధారిత పవర్డ్ అసిస్టెంట్ అందిస్తుంది. ప్రతి దరఖాస్తును ధృవీకరించి ట్రాక్ చేసేందుకు నమ్మకాన్ని బ్లాక్ చైన్ టెక్నాలజీ అవాకశం కల్పిస్తుంది. డేటా ఆధారిత పాలనను చిత్తశుద్ధితో అమలు చేస్తుందన్నారు. ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా అభివృద్ధి నివేదికను ప్రజల ముందు పెడుతున్నామన్నారు. రికార్డు స్థాయిలో పట్టణాభివృద్ధి జరిగిందని, హైదరాబాద్ పర్ క్యాపిటల ఇన్‌కమ్19.3 చొప్పున పెరుగుతుందన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో హైదరాబాద్ ఇప్పటికి మొదటి స్థానంలో ఉందని, ఉబటూ గత 15 సంవత్సరాలుగా తెలంగాణ వార్షిక అభివృద్ధి రేట్ పెరిగిందన్నారు. చాలా మంది కి ఉపాధి కల్పన.. ప్రతీ ఇంట్లో ఆదాయం పెరిగిందని, తమ మధ్య సిద్ధాంత పరంగా రాజకీయ విధానాలు వేరుగా ఉన్నప్పటికీ ప్రగతిశీల అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. గృహ సముదాయాల అమ్మకాల్లో కూడా హైదరాబాద్ ముందంజలో ఉందని, హోమ్ లోన్స్ అంశంలో కూడా హైదరాబాద్ అగ్రస్థానంలో ఉందన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని, 45 వేల ఉద్యోగాలు ఐటీలో ఇచ్చాము. ప్రస్తుతం 9.7 లక్షల మంది ఐటి ఉద్యోగులు హైదరాబాద్‌లో పని చేస్తున్నారన్నారు. అంతేకాకుండా..'అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఐటి సెంటర్లు హైదరాబాద్‌లో ఉన్నాయి. రాబోయే మూడేళ్ళ లో 34 మిలియన్ స్క్వార్ ఫీట్ నుంచి 37 మిలియన్ల స్క్వేర్ ఫీట్ ఆఫీస్ స్పేస్ కావాలని అడుగుతున్నారు. 1.37 వేల రెసిడెన్షియల్ యూనిట్లు కావాలని కోరుతున్నారు. 23 శాతం బిల్డింగ్ పర్మిషన్స్ అధికంగా ఇచ్చాము. హైదరాబాద్ నగరం ప్రపంచంలోని ఐదు నగరాల్లో ఒకటిగా నిలిచింది. హైదరాబాద్ మహా నగరాన్ని ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉంది. సరళికృత మార్పులు తేవాలని భావిస్తున్నాము. పౌర సేవలను సరళీకృతం చేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు.

హరీశ్‌రావుపై పంజాగుట్టలో కేసు నమోదు

హైదరాబాద్, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి): మాజీ మంత్రి హరీశ్ రావుపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. తన ఫోన్‌ను ట్యాపింగ్ చేశారని సిద్దిపేటకు చెందిన చక్రధర్ గౌడ్ జూబ్లీహిల్స్ ఏసీపీకి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో హరీశ్‌రావుపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసిన రాధాకిషన్ రావుపై కూడా కేసు నమోదైంది. 120 (బీ), 386,409,506 , రెడ్ విత్ 34, ఐటీ యాక్ట్ సెక్షన్ల కింద పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. మిస్టర్ రేవంత్ రెడ్డి అడుగడుగునా నువ్వు చేస్తున్న అన్యాయాలను నిలదీస్తున్నందుకు, నీ నిజ్వస్వరూపాన్ని బట్టబయలు చేస్తున్నందుకు, ప్రజల పక్షాన నీ మీద ప్రశ్నలు సంధిస్తున్నందుకు భరించలేక, సహించలేక నామీద అక్రమ కేసులెన్నో బనాయిస్తున్నావని మండిపడ్డారు. నీకు చేతనైంది ఒక్కటే.. తప్పు చేసి దబాయించడం, తప్పుడు కేసులు బనాయించడమని విమర్శించారు. నీ రెండు నాల్కల వైఖరిని బట్టబయలు చేసినందుకు, ప్రజాక్షేత్రంలో నిలదీసినందుకు తట్టుకోలేక ఇవాళ పంజాగుట్ట స్టేషన్‌లో మరో తప్పుడు కేసు పెట్టించారని మండిపడ్డారు. నువ్వు లక్ష తప్పుడు కేసులు పెట్టించినా, నేను ప్రజల పక్షాన ప్రశ్నించడం ఆపనని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ప్రజా కోర్టులో, ప్రజా తీర్పుతో నీకు తగిన శిక్ష పడేంత వరకు ఆగనని తెలిపారు.

శ్రీకాంత్‌చారి అమరత్వం ఎంతో గొప్పది : కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి): శ్రీకాంతాచారి అమరత్వం గొప్పదని, ఆయన ప్రాణత్యాగం తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరువరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారులపై నాటి కాంగ్రెస్ ప్రభుత్వం దమనకాండ, కేసీఆర్ అరెస్టును చూసి తట్టుకోలేకపోయిన శ్రీకాంతాచారి అగ్నికి అహుతి అయ్యి అమరుడయ్యారని చెప్పారు. ఆయన ప్రాణత్యాగం తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసిందన్నారు. శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా ఎక్స్ వేదికగా జోహార్లు అర్పించారు. 'శ్రీకాంతాచారి అమరత్వం గొప్పది. ఆయన ప్రాణత్యాగం తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరువరు. తెలంగాణ ఉద్యమకారులపై నాటి కాంగ్రెస్ ప్రభుత్వం దమనకాండ, కేసీఆర్ గారి అరెస్ట్ ను చూసి తట్టుకోలేకపోయిన శ్రీకాంతాచారి అగ్నికి అహుతి అయ్యి అమరుడయ్యాడు. శ్రీకాంతాచారి ప్రాణత్యాగం తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసింది. శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా ఆయనకు జోహార్లు అర్పిస్తున్నాను. జోహార్ శ్రీకాంతాచారి! జై తెలంగాణ.' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

తుప్రాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

బైక్‌ను ఢీకొట్టిన ట్యాంకర్..

మెదక్, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి): బైక్‌ను టిప్పర్ ఢీకొట్టడంతో బైకర్ తీవ్రంగా గాయపడ్డారు. దశరథ్ అనే వ్యక్తి బైక్‌పై మున్సిపల్ ఆఫీస్ వైపు వెళ్తున్నారు. అతని వెనకాలే ఓ టిప్పర్ వస్తున్నది. నర్సాపూర్ చౌరస్తా వద్ద టిప్పర్ ఎడమవైపు టర్న్ తీసుకుంటున్నది. అయితే అదేసమయంలో స్ట్రెయిట్‌గా వెళ్తున్న బైక్‌ను గమనించకుండా టిప్పర్ డ్రైవర్ ఎడమవైపు మళ్లారు. దీంతో ద్విచక్ర వాహనంపైనుంచి లారీ వెళ్లిపోయింది. ఈ క్రమంలో బైక్ ట్యాంకర్ పేలడంతో మంటలు చెలరేగాయి. అప్పటికే గాయపడిన దశరథ్‌కు మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు మంటలు ఆర్పివేసి.. అతడిని దవాఖానకు తరలించారు. ఇదంతా సమీపంలో ఉన్న సీసీటీవీ కెమెరాలో రికార్డయింది. ఈ యాక్సిడెంట్ ఎప్పుడు జరిగిందో తెలియనప్పటకీ.. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది.

పుష్ప-2 టికెట్ ధరల పెంపుపై నివేదిక!

మైత్రి మూవీస్‌కు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి) : టాలీవుడ్ సినీ నటుడు అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 సినిమా టికెట్ ధరలు పెంపుపై హైకోర్టులో విచారణ జరిగింది. బెనిఫిట్ షోలకు భారీగా టికెట్ ధరలు పెంచారని, సామాన్యులు మూవీ చూసే పరిస్థితి లేదని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పూర్తి వివరాలు రెండు వారాల్లో సమర్పించాలని మైత్రి మూవీస్ కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. స్కూల్ డేస్ లో రిలీజ్ రోజే సినిమా చూసిన సందర్భాలు ఉన్నాయన్న న్యాయమూర్తి..ఇప్పట్లో కుటుంబం మొత్తం సినిమా వీక్షించాలంటే 8 వేలు రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పుష్ప 2 బెనిఫిట్ షో ద్వారా వచ్చే నగదు ఎక్కడికి మళ్లిస్తున్నారని పిటిషనర్ ప్రశ్నించారు. అయితే, పూర్తి నివేదిక పరిశీలించి ఆదేశాలు ఇస్తామని హైకోర్టు తెలిపింది. జీవోలను సైతం పరిశీలిస్తామని పేర్కొంది. రాత్రి 10 గంటలకు షో వేస్తే మధ్యరాత్రి 1 అవుతుందని పిల్లలకు నిద్ర అవసరమని హైకోర్టు అభిప్రాయపడింది. కాగా, పుష్ప-2 సినిమా టిక్కెట్ రేట్లను పెంచుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం అనుమతించిన సంగతి తెలిసిందే. ప్రీమియర్ షో టిక్కెట్ ధరపై రూ. 800 వరకు పెంచింది. డిసెంబర్ 5 నుంచి 8వ తేదీ వరకు రూ. 200, ఆ తర్వాత కూడా టికెట్ ధరలు పెంచుకోవడానికి అవకాశం ఇచ్చింది. అయితే, ఈ సినిమా టిక్కెట్ రేట్లను భారీగా పెంచడంపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది.పుష్ప-2 సినిమాలో అల్లు అర్జున్ సరసన నేషనల్ క్రష్ రష్మిక మందన్న జోడీగా నటించింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ సినిమాకు సుకుమార్ దర్శకుడుగా ఉన్నారు.

బీఆర్ఎస్ గురుకుల బాటలో తీవ్ర ఉద్రిక్తత

ఏనుగుల రాకేష్‌రెడ్డి సహా 50మంది అరెస్టు

హైదరాబాద్,డిసెంబర్3 (ఋషి ప్రతినిధి): బీఆర్ ఎస్ చేపట్టిన గురుకుల బాట కార్యక్రమం వరంగల్‌లో ఉద్రిక్తతకు దారి తీసింది. హాస్టళ్లలో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకునేందుకు బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్ రెడ్డి, ఆయన అనుచరులు దాదాపు 50 మంది హనుమకొండ జిల్లా పరిధి మడికొండలోని గురుకులానికి వెళ్లారు. హాస్టల్ లోపలికి వెళ్లేందుకు అనుమతి లేదంటూ స్థానిక పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మడికొండ సీఐ పుల్యాల కిషన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేత రాకేశ్ రెడ్డిని అరెస్ట్ చేసేందుకు ప్రయత్నం చేశారు. దీంతో గులాబీ పార్టీ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేయగా, ఇరువర్గాల మధ్య కొద్దిసేపు మాటల యుద్ధం నడించింది. అప్పటికే పోలీసులు బలగాలు అక్కడ మోహరించడం, బీఆర్ఎస్ నేతలకు, వారికి మధ్య తోపులాట జరగడంతో కొద్దిసేపు అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పరిస్థితి చేయి దాటే అవకాశం ఉంటడంతో రాకేష్ రెడ్డితో పాటు బీఆర్ఎస్ పార్టీకి చెందిన దాదాపు 50 మంది కార్యకర్తలను మడికొండ పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. దాదాపు గంట పాటు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడగా.. అరెస్ట్ అయిన బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వం, పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకులాలు బాగయ్యేంత వరకూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంబడిస్తూనే ఉంటామని.. బీఆర్ఎస్ నేత రాకేష్ రెడ్డి స్పష్టం చేశారు. మడికొండ పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించిన నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అరకొర వసతులతో నిర్వహిస్తున్న గురుకులాల్లోని సమస్యలను తెలుసుకునేందుకు 'గురుకుల బాట' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు వచ్చిన తమను పోలీసులు అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. తామేమీ సంఘ విద్రోహ శక్తులం కాదన్నారు. అరకొర వసతులతో అవస్థలు పడుతున్న విద్యార్థులకు సహాయం చేయడానికే వచ్చామని, అంతే తప్ప రాజకీయాలు చేయడానికి రాలేదని రాకేష్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో కూడా పాఠశాలల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించామని, ఎన్నడూ ఇంత నిర్బంధం చూడలేదన్నారు.దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా గడిచిన పది నెలల కాలంలోనే మొత్తంగా 49 మంది విద్యార్థులు మరణించారని.. రాకేష్ రెడ్డి ఆరోపించారు. సుమారు 1500 మంది విద్యార్థులు తీవ్ర ఆస్వస్థతకు గురై ఆసుపత్రి పాలయ్యారన్నారు. గురుకుల పాఠశాల పిల్లలు హాస్టల్‌లో కంటే హాస్పిటల్‌లోనే ఎక్కువగా ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులాల్లో అంతా బాగానే ఉంటే బీఆర్ఎస్ నేతలను అడ్డుకోవడం ఎందుకని ప్రశ్నించారు. అసలు లోపలికి అనుమతి ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలని రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి పాలన చేతకాక ఉపాధ్యాయులను అడ్డు పెట్టుకొని రాజకీయాలు చేస్తోందని, పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులను గేటు దగ్గర కాపలాకు పెడుతోందని విమర్శించారు. సమస్యలకు పరిష్కారం చూపకుండా ప్రభుత్వం ఇలాంటి నిర్బంధాలకు పాల్పడడం దుర్మార్గమని విమర్శించారు. ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టినా గురుకులాల్లో సమస్యలు పరిష్కరించేంత వరకు తమ పోరాటం ఆగదని రాకేష్ రెడ్డి స్పష్టం చేశారు.

శ్రీకాంత్‌చారి సేవలు ఎనలేనివి : హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి): తెలంగాణ మలిదశ ఉద్యమంలో తొలి అమరుడు కానిస్టేబుల్ శ్రీకాంతాచారి 15వ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు నివాళులర్పించారు. అగ్నికి ఆహుతి అవుతూ 'జై తెలంగాణ' అంటూ దిక్కులు పెక్కటిల్లేలా నినదించిన పోరాట యోధుడు శ్రీకాంతా చారి అని చెప్పారు. కేసీఆర్ అరెస్టును, ఉద్యమకారులపై ప్రభుత్వ అణచివేతను సహించలేక ఆత్మబలిదానం చేసుకున్న తెలంగాణ అమరుడని తెలిపారు. జోహార్ శ్రీకాంతాచారి అంటూ ట్వీట్ చేశారు. కెసిఆర్ గారి అరెస్టును, ఉద్యమ కారులపై ప్రభుత్వ అణిచివేతను సహించలేక ఆత్మబలిదానం చేసుకున్న తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా నివాళి. 2009, నవంబర్ 29న ఉద్యమ నాయకుడు కేసీఆర్ ఆమరణ దీక్షకు పూనుకున్నారు. కరీంనగర్ నుంచి సిద్దిపేట దీక్ష స్థలికి వెళ్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. దీంతో తెలంగాణ అంతటా ఆందోళనలు, ఉద్యమాలు, నినాదాలతో రాష్ట్రం అట్టుడికిపోయింది. తెలంగాణ ఉద్యమకారులపై ప్రభుత్వం అణచివేతలు ప్రారంభించింది. ఉద్యమకారులపై లాఠీ దెబ్బల , అరెస్టులు చూసి తట్టుకోలేకపోయిన శ్రీకాంతాచారి.. కేసీఆర్ అరెస్టు నిరసనగా హైదరాబాద్ ఎల్బీనగర్ చౌరస్తాలో జరిగిన ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. అగ్నికి ఆహుతి అవుతూనే జై తెలంగాణ అంటూ దిక్కులు పెక్కటిల్లేలా నినాదాలు చేశారు. 80 శాతానికిపైగా కాలిపోయిన ఆయనను పోలీసులు, ఉద్యమకారులు సమీపంలోని దవాఖానకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం యశోదకు తీసుకెళ్లారు. రెండు రోజుల తర్వాత ఉస్మానియా దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి అపోలో హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ డిసెంబర్ 3న శ్రీకాంతాచారి అమరుడయ్యారు.

పాఠశాలకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకుల అరెస్టు

హనుమకొండ, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి): హనుమకొండ జిల్లాలోని మడికొండలో బీఆర్ఎస్ గురుకుల బాట ఉద్రిక్తతకు దారితీసింది. పార్టీ నాయకుడు రాకేశ్ రెడ్డి, కార్పొరేటర్లు రాధిక రెడ్డి, రవి నాయక్ ఆధ్వర్యంలో మడికొండలోని సోషల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలకు వెళ్లిన బీఆర్ఎస్ లీడర్లను పోలీసులు అడ్డుకున్నారు. అనుమతి లేదంటూ పాఠశాలలోకి వెళ్లకుండా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, పార్టీ కార్యకర్తలకు మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకున్నది. రాకేశ్ రెడ్డి సహా 50 మంది కార్యకర్తలను బలవంతంగా వాహనాల్లో ఎక్కించుకుని మడికొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రాకేశ్ రెడ్డి మాట్లాడుతూ.. గురుకులాలు బాగయ్యే వరకు కాంగ్రెస్ సర్కార్‌పై పోరాటం కొనసాగుతుందన్నారు. సమస్యలకుప రిష్కారం చూపకుండా ప్రభుత్వం నిర్బంధాలకు పాల్పడటం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నియంత పాలనకు చరమ గీతం పాడి ఏడాది

గడీల పాలనతో రాష్ట్రం విసిగిపోయింది

కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

హైదరాబాద్,డిసెంబర్3 (ఋషి ప్రతినిధి): రాష్ట్రంలో నియంత పాలనకు చరమ గీతం పాడి ఏడాది అయ్యింది. ప్రజా పాలన ఏర్పాటుకు సంపూర్ణంగా సహకరించిన తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ గడీల పాలన, ఫామ్ హౌస్ పాలనతో విసిగిపోయింది తెలంగాణ. అవినీతి, కుటుంబ పాలనకు స్వస్తి పలికి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటైంది. సంపూర్ణ మెజారిటీ ఇచ్చి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మద్దతు ఇచ్చిన ప్రజలకు ధన్యవాదాలు చెప్పారు.ఏడాది పాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మిగతా మంత్రుల సమిష్టి నిర్ణయాలతో తొలి ఏడాది అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో వెలిగిపోతోందన్నారు. ప్రస్తుతం రైజింగ్ తెలంగాణగా ఉందన్న విషయం ప్రజలకు అందరికి తెలుసన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయలేనంత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందన్నారు టీపీసీసీ. ముఖ్యంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత సదుపాయం, ఆరోగ్య శ్రీ 10 లక్షల పెంపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకు గ్యాస్ కనెక్షన్ ఇచ్చి మాట నిలబెట్టుకున్నామని తెలిపారు.రైతులకు రెండు లక్షల రుణమాఫీ కోసం 21 వేల కోట్ల రూపాయల కేటాయించిందన్నారు. దీని ద్వారా 23 లక్షల మందికి లబ్ధి జరిగిందన్ని విషయాన్ని వక్కానించారు మహేష్‌కుమార్. ధాన్యం 500 రూపాయల బోనస్‌తో రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. ఒక్క ఏడాదిలో సుమారు 54 వేల 500 ఉద్యోగాలు ఇచ్చి యువతను అదుకుందని, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ లు ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. డ్రగ్స్ నివారణకు కృషి జరుగుతోందని వివరించారు.ఇక మూసీ నది పునర్జీవనం ఒక అద్భుతమైన పథకంగా వర్ణించారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఓ వైపు పథకాలు.. మరోవైపు అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఏడాదిలో అన్ని రకాలుగా సహకరించిన ప్రజలకు తన వంతు ధన్యవాదాలు తెలిపారు తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్.

ఎన్‌కౌంటర్‌పై సమగ్ర రిపోర్ట్ ఇవ్వండి

తెలంగాణ హైకోర్టు కీలక నిర్ణయం

ఏటూరునాగారం ఎన్‌కౌంటర్‌పై హైకోర్టులో విచారణ

హైదరాబాద్,డిసెంబర్3 (ఋషి ప్రతినిధి): తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఏటూరునాగారం ఎన్‌కౌంటర్ వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు నక్సల్స్ మరణించిన విషయం తెలిసిందే. అయితే తన భర్త మల్లయ్య మృతదేహానికి పంచనామా సరిగా జరగలేదని, డెడ్‌బాడీపై కాలిన గాయాలు ఉన్నాయంటూ కే.ఐలమ్మ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. పిటిషనర్, ప్రభుత్వ వాదనలు విన్న న్యాయస్థానం తదుపరి ఆదేశాలు వచ్చే వరకు మల్లయ్య మృతదేహాన్ని భద్రపరచాలని పోలీసులను ఆదేశించింది. ఎన్‌కౌంటర్‌కు సంబంధించిన పరిణామాలు, పంచనామాపై సమగ్ర నివేదిక సమర్పించాలన్న న్యాయస్థానం ఆదేశించింది. మిగతా మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే మావోయిస్టుల మృతదేహాలను భద్రపరిస్తే శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని ప్రభుత్వ తరపు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. మృతదేహాలకు నిబంధనల ప్రకారమే పోస్టుమార్టం నిర్వహించామన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్, హైకోర్టు ఆదేశాల అనుసారమే పంచనామా ప్రక్రియ పూర్తి చేశామని, 8 మంది వైద్య నిపుణులతో ఈ ప్రక్రియ పూర్తి చేశామని హైకోర్టుకు గవర్నమెంట్ ప్లీడర్ తెలిపారు. దీంతో పోస్టుమార్టం సమగ్ర నివేదికను సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేస్తున్నట్టు పేర్కొంది.కాగా ఎన్‌కౌంటర్‌లో మరణించిన ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలకు సోమవారమే పోస్టుమార్టం జరిగింది.

ఆదిలాబాద్‌కు పులి భయం

భయాందోళనలో ప్రజలు

ఆదిలాబాద్, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో పులి సంచరిస్తుందని కొంతమంది పాత వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో గ్రామీణ ప్రజలు సోమవారం భయాందోళనకు గురయ్యారు. పత్తి తీసేందుకు వెళ్లిన మహిళలు భయంతో ఇంటిబాట పట్టారు. కొంతమంది పులి సంచారం నిజమా? అబద్దమా అని ఆయా గ్రామాల వారికి ఫోన్‌లు చేసి తమ సందేహాన్ని నివృత్తి చేసుకున్నారు. దీంతో పాటు మండలంలోని యాపల్‌గూడ పంచాయతీ పరిధిలోని రాములగూడలో ఓ మహిళ పులి అడుగు జాడలను చూసినట్లు చెప్పడంతో స్థానికంగా కలకలం రేపింది. సమాచారమందుకున్న అటవీశాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని అడుగులను పరిశీలించారు. ఆ తర్వాత తంతోలి, అంకోలి, కొతూరు, చింతగూడ గ్రామాల్లో బెబ్బులి సంచరిస్తుందంటూ కొంతమంది సామాజిక మాధ్యమం వేదికగా వదంతులను సృష్టించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు భయం భయంగా బిక్కుబిక్కుమంటూ పొలాల నుంచి ఇంటికి చేరుకున్నారు. వాంకిడి మండల కేంద్రానికి సమీపంలోని పత్తి చేనులో పులి కనిపించింది అనే వార్త కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన ఇటన్‌కర్ తుకారాం అనే వ్యక్తికి పత్తి చేనులో సోమవారం ఉదయం 7గంటల సమయంలో బెబ్బులి కనిపించింది. పాలేరు మారుతి పురుగుమందు పిచికారీ చేస్తుండగా కనిపించడంతో అతడు వెంటనే గ్రామానికి వచ్చి గ్రామస్థులు, అటవీ అధికారులకు ఈ సమాచారం తెలియజేశారు. అనంతరం ఆ స్థలాన్ని సందర్శించి పరిశీలించగా పాదముద్రలు స్పష్టంగా కనిపించక పోవడంతో పులి కాకపోయి ఉండవచ్చని ఫారెస్ట్? ఉపరేంజి అధికారిణి ఝాన్సీలక్ష్మి, బీట్ అధికారి శ్రీనివాస్‌లు వెల్లడించారు. ఇదిలా ఉండగా తాను చూసింది పులేనని మారుతి స్పష్టం చేస్తుండటం వల్ల వాంకిడితో పాటు పరిసర గ్రామాల్లోని ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే పత్తిని

కాకినాడ పోర్టు, అదానీపై చర్చ

సమీకృత పర్యాటక, స్పోర్ట్స్ పాలసీ

ఆయుర్వేద, హోమియోపతి ప్రాక్టీషనర్ రిజిస్ట్రేషన్ చట్ట సవరణ

ఐటి, గ్లోబల్ కాంపిటేటివ్ సెంటర్స్ పాలసీకి ఆమోదం

ఏపీ టెక్స్‌టైల్ అపరల్ అండ్ గార్మెంట్స్ పాలసీ ఆమోదం

రాజధాని నిర్మాణానికి వేగంగా చర్యలు

ఏపీ కేబినేట్‌లో పలు కీలక నిర్ణయాలు

అమరావతి, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి):కాకినాడ పోర్టు, గౌతమ్ అదానీ వ్యవహారంపై కేబినేట్ భేటీలో మంత్రివర్గం కీలకంగా చర్చించింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన ఏపీ కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సమీకృత పర్యాటక పాలసీ 2024-29తో పాటు 2024 నుంచి 2029 స్పోర్ట్స్ పాలసీలో మార్పులకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. పీఎం ఆవాస్ యోజన గిరిజిన గృహ పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఏపీ మారిటైమ్ పాలసీకి, ఏపీ టెక్స్‌టైల్స్ గార్మెంట్ పాలసీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఐటీ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ పాలసీ 4.0కు, పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని డిసెంబరు 15ను ఆత్మార్పణ సంస్మరణ దినంగా నిర్వహించడానికి ఆమోదం తెలిపారు. ఆయుర్వేద, హోమియోపతి ప్రాక్టీషనర్ రిజిస్ట్రేషన్ చట్ట సవరణకు సైతం చంద్రబాబు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఏపీ మంత్రివర్గ సమావేశంలో అదానీ పవర్ వ్యవహారంపై కీలకంగా చర్చ జరిగింది. వైసీపీ హయాంలో విద్యుత్ కొనుగోళ్లలో సెకీతో ఒప్పందంపై ఇటీవల ఆరోపణలు రావడం తెలిసిందే. సెకీ ఒప్పందంపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై చర్చించారు. అదానీ పవర్‌పై నిర్ణయం తీసుకునే వరకు పవర్ సప్లై అగ్రిమెంట్‌ని పెండింగ్‌లో పెట్టాలని మంత్రివర్గం భావిస్తోంది. అదానీతో గత ప్రభుత్వం విద్యుత్ ఒప్పందం కారణంగా రూ. 1750 కోట్ల ముడుపులు చేతులు మారినట్లు ఆరోపణలు వచ్చాయి. ఏపీ కేబినెట్‌లో ఈ విషయాలను సహచర మంత్రులకు చంద్రబాబు వివరించారు. విద్యుత్ ధరలు తగ్గించకపోతే ఒప్పందాన్ని రద్దు చేసుకునే అవకాశం కనిపిస్తోంది.పెనాల్టీ చెల్లించడమే ఉత్తమమని మంత్రివర్గం భావిస్తోంది. అదానీతో విద్యుత్ ఒప్పందం రద్దు చేసుకుంటే రూ. 2100 కోట్లు పెనాల్టీగా చెల్లించాల్సి ఉంటుందని కీలకంగా చర్చించారు. మంగళవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రిమండలి సమావేశం అయింది. ఈ సమావేశంలో 10 అంశాలపై కేబినెట్‌లో కీలకంగా చర్చించారు. పలు పాలసీలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. 3గంటల పాటు సమావేశం సాగింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి కొలుసు పార్థసారధి మీడియాకు వెల్లడించారు. 'ఇన్ఫ్రాస్ట్రక్చర్ టెక్నాలజీ అండ్ గ్లోబల్ కాంపిటేటివ్ సెంటర్స్ పాలసీ 2024-29కి ఆమోదం తెలిపాం. 2047లో భాగంగా ఒక కుటుంబానికి ఓ పారిశ్రామికవేత్త లక్ష్యాల సాధనకు ఈ పాలసీ ఉపయోగపడుతుంది. ప్రభుత్వం కో వర్కింగ్ స్పేస్‌లు, నైబర్ వర్కింగ్ స్పేస్‌లు క్రియేట్ చేయాలని నిర్ణయం. వర్క్ ఫ్రం హోంకు ఈ విధానం ఎంతో ఉపయోగపడనుంది. ఇలా స్పేస్‌లు డెవలెప్ చేసే వారికి ఇన్సెంటివ్ ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అన్ని రకాల వ్యాపారాలతో పాటు ఐటీ కంపెనీలు అవే భవనాల్లో ఉండాలనే కోవర్కింగ్ స్పేస్ పనిచేస్తుంది' అని మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. వందమందికి వర్కింగ్ స్పేస్ ఏర్పాటు చేస్తే ఒక్కొక్కరికి రూ. 2వేలు చొప్పున ఇన్సెంటివ్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. ఏపీ టెక్స్‌టైల్ అపరల్ అండ్ గార్మెంట్స్ పాలసీ 2024-29కి క్యాబినెట్‌లో ఆమోదం పొందింది. రూ. 10 వేల కోట్లు పెట్టుబడులు ఈ రంగంలో రావాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. చేనేత కార్మికులకు, పద్మశాలీలకు ఈ పాలసీ వల్ల ఎంతో ఉపయుక్తం అవుతుంది.ఈ పాలసీలో రాయితీలు పెద్ద ఎత్తున రాయితీ ఇస్తాం, పీపీపీ మోడ్‌లో అయిదు టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు ఈ పాలసీ లక్ష్యం.ఏపీ మారిటైమ్ పాలసీకి క్యాబినెట్‌లో ఆమోదం. మూడు తాగునీటి ప్రాజెక్టులు ఆలస్యం అవ్వడం వల్ల జీవో 62 ద్వారా ప్రైజ్ ఎ÷-జడెస్ట్‌మెంట్ చేయబోతున్నాం. ఉద్దానం తాగునీటి వసతి పులివెందుల, కర్నూలులో డ్రోన్ నియోజకవర్గాలకు పదిన్నర లక్షల మందికి తాగునీటి సమస్య తీర్చడానికి నిర్ణయం. దీనిలో ఒకటి మాజీ ముఖ్యమంత్రి నియోజకవర్గం కాగా మరొకటి మాజీ ఆర్థిక మంత్రి నియోజకవర్గం. పీఎంఏవై అర్బన్ , పీఎంఏవై గ్రామీణ్ పథకాల ద్వారా కేటాయించిన గృహాలు కొనసాగించి నిర్మించడానికి క్యాబినెట్ ఆమోదం. పీఎంఏవై అర్బన్ , పీఎంఏవై గ్రామీణ్ పథకాల ద్వారా కేటాయించిన గృహాలు కొనసాగించి నిర్మించడానికి క్యాబినెట్ ఆమోదం. పర్యటక రంగానికి పారిశ్రామిక హోదా ఇవ్వడం ద్వారా కొత్త ఉద్యోగాలు కల్పన సాధ్యం అవుతుంది. రాజధాని అమరావతిని ఎలక్ట్రిక్రల్ మొబిలిటీ నగరంగా అభివృద్ధి చేయాలని నిర్ణయం. రియల్ టైం గవర్నెన్స్‌ను తెచ్చి అప్పట్లో పాలనలో చంద్రబాబు రిఫార్మ్ తెచ్చారు. దీనికి సంబంధించి ఆర్టిజీ 4.0 అమలుకు ప్రతిపాదన. వాట్సాప్ ద్వారానే అన్ని రకాల సర్టిపికెట్లు అందించే ఏర్పాట్లు చేస్తున్నాం' అని మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. అమరావతి రాజధాని పనులను కొంత మేరకు గత టీడీపీ ప్రభుత్వంలో పూర్తి చేశామని మంత్రి నారాయణ వ్యాఖ్యానించారు. జగన్ ప్రభుత్వం మూడు ముక్కలు ఆటలు ఆడి రాజధాని పనులను నిలిపేసిందని మండిపడ్డారు. ఆ పనులు ఆగిపోయినా ఏజెంట్లను అలాగే ఉంచారని.. వారి మిషనరీ ఇక్కడే ఉండిపోయిందని చెప్పారు. అప్పట్లో ఇచ్చిన టెండర్ల రేటుకు ఇప్పుడు చేయలేమని కాంట్రాక్టర్లు అంటున్నారని.. దీంతో సీఈలతో కమిటీ వేసి క్యాబినెట్‌లో అప్రూవ్ చేశామని గుర్తుచేశారు. 'అమరావతి రాజధానిలో ట్రంక్ రోడ్డు, లే అవుట్ రోడ్లతో పాటు చాలా పనులను చేశారు. రూ.11, 471 కోట్ల పనులకు అధారిటీలో ఆమోదం రాగా ఇవాళ క్యాబినెట్‌లో కూడా చెప్పి ఆమోదం పొందేలా చేశాం. అమరావతిలో పనులు చేయకపోగా ఉన్న రోడ్లను, ఏసీలు, డోర్‌లను తీసుకువెళ్లారు ఈ నష్టం రూ.286.78 కోట్లుగా అంచనా వేశారు. జీఎస్టీ ఇప్పడు టెండర్లు పిలవడం వల్ల రూ.452.35 లక్షలు పెరిగింది. 360 కిలో మీటర్లు ట్రంక్ రడ్లుకు ఎస్టిమేషన్ రూ.460 కోట్లు పెరిగాయి. 1200 కిలో మీటర్లు లే అవుట్ రోడ్లు, 3600 అపార్ట్‌మెంట్లు అందులో మేజర్ వర్క్ అయిపోయింది. అడ్మినిస్ట్రేటివ్ టవర్స్, అసెంబ్లీ, హైకోర్టు నిర్మాణాలు ఈ నెలాఖరులోగా టెండర్లు పిలిచి పనులను పూర్తిచేస్తాం. అప్పట్లో రూ. 41 వేల కోట్లు బడ్జెట్‌గా వేస్తే ఇప్పుడు 30శాతం పెరగనుందని మంత్రి నారాయణ తెలిపారు.

బలహీనపడినా తగ్గని తుపాను

మరో మూడు రోజులపాటు వానలు!

అమరావతి, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి): గత వారం రోజులుగా దడ పెట్టిస్తున్న ఫెంగల్ తుపాను ఎట్టకేలకు శాంతించింది. ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి వద్ద తీరం దాటింది. అయినా దీని ప్రభావం 6 గంటలకు పైగా భీభత్సం సృష్టించింది. ఆదివారం సాయంత్రానికి తీవ్ర వాయుగుండంగా బలహీనపడింది. ప్రస్తుతం ఇది పుదుచ్చేరి సమీపంలోని కడలూరుకు 30 కిలోమీటర్లు, విల్లుపురానికి 40 కిలోమీటర్లు, చెన్నైకి 120 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. సోమవారం రాత్రికి మరింత బలహీనపడి వాయుగుండంగా మారనుంది. ఆ తర్వాత అల్పపీడనంగా మారి నిర్వీర్యం అవుతుందని వాతావరణ శాఖ వివరించింది. ఫెంగల్ తుపాను ప్రభావంతో ఏపీలో పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. చిత్తూరు, తిరుపతి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో ఆదివారం భారీ వర్షాలు కురిశాయి. కోస్తా జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు పడ్డాయి. గడచిన 24 గంటల్లో తిరుపతి జిల్లా పుత్తూరులో అత్యధికంగా 18.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అదే జిల్లాలోని రాచలపాలెంలో 15.2 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఇక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోనలో 10 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంలో తిరుపతి జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. ఇక్కడ గత 3 రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. సత్యవేడు, గూడూరు, శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తిరుపతిలో మామిడి కాలువ, పాముల కాలువ, కార్వేటి కాలువ, ఈదులకాలువ, సున్నపు కాలువలతో సహా 21 కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వర్షం ప్రభావంతో 116 ఆర్టీసీ సర్వీసులు, గ్రామీణ ప్రాంతాలకు 21 ఆర్టీసీ సర్వీసులు నిలుపుదల చేశారు. మరోవైపు చెన్నైలో ఇంకా తీవ్రంగా వర్షాలు పడుతూనే ఉన్నాయి. దీంతో నెల్లూరు, తిరుపతి, చిత్తూరు ప్రాంతాల నుంచి చెన్నైకి వెళ్లే పలు బస్సులను రద్దు చేశారు. ఇక సోమవారం కూడా రాష్ట్రంలో పలు చోట్ల మోస్తరు వర్షాలు కురుస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. కృష్ణా జిల్లాలో ఆదివారం కూడా వర్షాలు కురిశాయి. 19,500 ఎకరాల్లో వరి నీటపాలైంది. కోతలు పూర్తయిన చోట్ల ధాన్యాన్ని రోడ్లపై రాశులు పోయగా.. అదీ తడిసిపోయింది. పలు జిల్లాల్లో కంది, మిరప వంటి పంటలు పూత దశలో ఉండటంతో గాలులకు రాలిపోయింది. అకాల వర్షాల వల్ల పంటలు తెగుళ్ల బారిన పడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. విజయనగరంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల పంటను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. కోతకు వచ్చిన వరి, రాగి, మొక్కజొన్న పంటలు వానలకు దెబ్బ తిన్నాయి. శ్రీకాకుళంలో చెదురుమదురు జల్లులు పడ్డాయి. తిరుమలలోని రెండో ఘాట్ రోడ్‌లో కొండ చరియలు విరిగిపడ్డాయి. సకాలంలో టీటీడీ సిబ్బంది స్పందించి వాటిని తొలగించింది. ఘాట్ రోడ్లపై దట్టమైన పొగమంచు కమ్ముడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. వర్షానికి తోడు చలి తీవ్రత పెరగడంతో జనాలు నానాపాట్లు పడుతున్నారు.

విశాఖలో ప్రేమ జంట ఆత్మహత్య

అమరావతి,డిసెంబర్3 (ఋషి ప్రతినిధి): విశాఖపట్నం షీలానగర్‌లో ప్రేమజంట ఆత్మహత్య స్థానికంగా కలకలం రేపింది. షీలానగర్ పిఎస్ వెంకటేశ్వర కాలనీలో వినాయక్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో తెల్లవారుజామున అపార్ట్‌మెంట్ పై నుండి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.మృతులను అమలాపురంకు చెందిన పిల్లి దుర్గారావు, సాయి సుస్మితగా పోలీసులు గుర్తించారు. మృతుడు దుర్గారావు హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో క్యాటరింగ్ నడుపుతుండగా, మృతురాలు సాయి సుస్మిత ఒక ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. ఆరు నెలలుగా అపార్ట్‌మెంట్లో ఉంటున్న పిల్లి దుర్గారావు వద్దకి మృతురాలు అప్పుడప్పుడు అపార్ట్‌మెంట్కు వచ్చి మృతురాలు సాయి సుస్మిత వచ్చి వెళుతుండేదని చెబుతున్నారు. సోమవారం రాత్రి ఇద్దరి మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగినట్టు గుర్తించారు. ఇంట్లో గాజు గ్లాస్, టీవీ రిమోట్ పగిలిపోవడం పోలీసులు గుర్తించారు. మృతురాలు సాయి సుస్మిత కుటుంబ సభ్యులకి పోలీసులు సమాచారం అందించారు, మృతుడు ఫోన్ లాక్ అవ్వడంతో దానిని తెరిచేందుకు ప్రయత్నిస్తున్నారు. మృతుడి వివరాలు తెలిస్తే ఆత్మహత్యకు కారణాలు తెలుస్తాయని చెబుతున్నారు. ఇద్దరు కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డారా క్షణికావేశంలో జరిగాయా అనే విషయంపై ఆరా తీస్తున్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా

పులివెందుల కేంద్రంగా బియ్యం

అక్రమ రవాణాలో కీలకంగా ఉన్న వైసీపీ నేతలు

మనోహర్‌కు ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి లేఖ

అమరావతి, డిసెంబర్3 (ఋషి ప్రతినిధి): ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కు టీడీపీ ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి లేఖ రాశారు. పులివెందుల కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతోందని లేఖలో ఆయన పేర్కొన్నారు. పులివెందుల... అనంతపురం జిల్లా సరిహద్దులలో ఉండడంతో అక్రమ రవాణాకు, బియ్యం నిల్వలకు వీలుగా ఉంటుందన్న కారణంతో స్మగ్లర్లు దీన్ని తమ స్థావరంగా మార్చుకున్నారని వివరించారు. 2019 నుంచి గత ప్రభుత్వ హయాంలో స్మగ్లింగ్ కు పాల్పడినవారే, ఇప్పుడు కూడా స్మగ్లింగ్ చేస్తున్నారని రాంగోపాల్ రెడ్డి వివరించారు. వేంపల్లి, ముదిగుబ్బ ప్రాంతానికి చెందిన వైసీపీ నేతలు ఈ అక్రమ రవాణాలో కీలకంగా ఉన్నారని చెప్పారు. ముదిగుబ్బకు చెందిన వైసీపీ నేత మిత్రమనాయుడు గత ఐదేళ్లుగా రేషన్ బియ్యం అక్రమ రవాణాలో కీలక పాత్ర పోషించాడని తెలిపారు. ఒక్క పులివెందుల నియోజకవర్గంలోనే ఈ స్మగ్లర్ల ఆదాయం నెలకు రూ.1 కోటి వరకు ఉందని తెలిపారు. అధికార యంత్రాంగం ఈ తంతును చూసీచూడనట్టు వదిలేస్తోందని, చిన్న చిన్న కేసులతో సరిపెడుతున్నారని వివరించారు.

వెంకట్రామిరెడ్డిపై జేసీ వ్యాఖ్యలు అభ్యంతరకరం

తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

అమరావతి, డిసెంబర్3 (ఋషి ప్రతినిధి): వైసీపీ మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డిపై తాడిపత్రి టీడీపీ మాజీ ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన సంగతి తెలిసిందే. జేసీ వ్యాఖ్యలపై తాడిపత్రి వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి స్పందించారు. వెంకట్రామిరెడ్డిపై జేసీ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమని ఆయన అన్నారు. జేసీ వర్గీయులు తాడిపత్రిలో విచ్చలవిడిగా మట్కా, పేకాట ఆడిస్తున్నారని పెద్దారెడ్డి ఆరోపించారు. వైసీపీ నేతలపై దాడులు పెరిగిపోయాయని చెప్పారు. బాధితులపైనే అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని విమర్శించారు. తనను కూడా తాడిపత్రికి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు.

గతం కన్నా ఘనంగా ధాన్యం సేకరణ: నాదెండ్ల

అమరావతి, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి):గత జగన్ పాలనలో ఈ సమయానికి సేకరించిన ధాన్యం 4.43 మెట్రిక్ టన్నులని.. బాధ్యతతో కూటమి ప్రభుత్వం సేకరించిన ధాన్యం 9.14 మెట్రిక్ టన్నులని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహన్ అన్నారు. వాస్తవ లెక్కలు చూస్తే జగన్ నిర్వాకం తెలుస్తోందని విమర్శించారు. సేకరించిన 24 గంటల్లో రైతు ఖాతాల్లోకి డబ్బులు వేస్తున్నామన్నారు. రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు.

రద్దీ రోజుల్లో వీఐపీ దర్శనాలు రద్దు

శ్రీశైలం దేవస్థానం కీలక నిర్ణయం

నంద్యాల, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి): శ్రీశైలం దేవస్థానం సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ సెలవులు, భక్తులు రద్దీగా ఉండే శని, ఆది, సోమవారాలలో, వైదిక కమిటీ నిర్ధారించిన రోజుల్లో వీఐపీ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా రోజుల్లో భక్తులం దరికీ స్వామివారి అలంకార దర్శనం మాత్రమే ఉంటుందని ఈవో వెల్లడించారు. శని, ఆది, సోమవారాలు, రద్దీ రోజుల్లో ఉదయాస్తమాన, ప్రదోషకాల, ప్రాతకాల, గర్భాలయ, సామూహిక అభిషేకాలు, స్పర్శ దర్శనం, వీఐపీ బ్రేక్ దర్శనాలు నిలుపుదల చేస్తూ ఆలయ ఈవో ఆదేశాలు జారీ చేశారు.

డిసెంబర్ 5న టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు

గోదావరి జిల్లాల్లో 48 గంటల పాటు వైన్ బంద్

అమరావతి,డిసెంబర్3 (ఋషి ప్రతినిధి): ఏపీలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కు సర్వం సిద్ధమైంది. డిసెంబర్ 5న తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ కారణంగా ఉభయ గోదావరి జిల్లాల్లో 48 గంటల పాటు మద్యం దుకాణాలను మూసివేయాలని ఆయా జిల్లాల కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు. పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి గురువారం(డిసెంబర్ 5) సాయంత్రం 4 గంటల వరకు మద్యం షాపులు మూసివేయనున్నారు. పోలింగ్ కేంద్రాలకు సమీపంలోని వైన్ షాపులను బంద్ చేయాలని ఆదేశించారు. టీచర్ ఎమెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించాలనే ఉద్దేశంతో మద్యం షాపుల్ని మూసివేయాలని ఆదేశించామని ఎన్నికల ఎన్నికల ప్రధానాధికారి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిసెంబర్ 5న

ఉభయ గోదావరి జిల్లాలో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ అధికారులు, సిబ్బందికి సోమవారం నాడు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఐదు జిల్లాల పరిధిలో 16,737 మంది ఓటర్లు ఉండగా 116 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాకినాడ జిల్లాలో 3418 మంది ఓటర్లు ఉండగా, 22 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. డిసెంబర్ 5వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను కాకినాడ జేఎన్ టీయూలోని బీఆర్ అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరుస్తారు. ఏపీ మద్యం విక్రయాల్లో ఉల్లంఘనలపై భారీగా జరిమానాలు విధిస్తూ ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీలో ప్రైవేట్ మద్యం దుకాణాలు బెల్ట్ షాపులపై విమర్శలు రావడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు ప్రారంభించింది. ప్రైవేట్ మద్యం దుకాణదారులు ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరలకు మద్యాన్ని విక్రయిస్తే మొదటి సారి రూ.5లక్షల జరిమానా విధిస్తారు. రెండో సారి అదే నేరానికి పాల్పడితే షాప్ లైసెన్స్ రద్దు చేస్తారు. లైసెన్స్ మంజూరు చేసిన దుకాణంలో కాకుండా ఇతర ప్రాంతాల్లో బెల్టు షాపుల ద్వారా మద్యం విక్రయిస్తే మొదటి సారి నేరానికి రూ.5లక్షల జరిమానా విధిస్తారు. రెండోసారి పట్టుబడితే షాప్ లైసెన్స్ రద్దు చేస్తారు.

బియ్యం అక్రమ రవాణాతో మాకేం సంబంధం?

మా వియ్యంకుడిది పారాబాయిల్డ్ రైస్ వ్యాపారం

పేర్ని నాని విమర్శలపై మంత్రి పయ్యావుల కౌంటర్

అమరావతి, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి): రేషన్ బియ్యంతో నా వియ్యంకుడి వ్యాపారానికి సంబంధం లేదని మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి సొంత ఫ్యాక్టరీలో మిల్లింగ్ చేసుకుని ఎగుమతి చేస్తారని మంత్రి స్పష్టం చేశారు. బియ్యం రవాణాకు సంబంధించి మంత్రి పయ్యావుల కేశవ్ వియ్యంకుడిపై మాజీ మంత్రి పేర్నినాని పలు ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై మంత్రి పయ్యావుల స్పందిస్తూ పేర్నినానికి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. మంగళవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పయ్యావుల మాట్లాడుతూ.. ' మా వియ్యంకుల కుటుంబం మూడు తరాలుగా బాయిల్డ్ రైస్ ఎగుమతి వ్యాపారం చేస్తున్నారు. ముడిబియ్యం వ్యాపారం చేయరు.. స్టీమ్ రైస్ మాత్రమే ఎగుమతులు చేస్తారు. నాతో వియ్యం పొందాక మా వియ్యంకుడు బియ్యం వ్యాపారం చేయట్లేదని అన్నారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోనే తన వియ్యంకులు వ్యాపారం చేస్తున్నారని... ఏపీలో గింజ కూడా కొనుగోలు చేయలేదన్నారు. మాజీ మంత్రులు పేర్ని నాని, అంబటి రాంబాబుకు అనుమానం ఉంటే చెక్ పోస్ట్ పెట్టుకుని ప్రతి బ్యాగ్‌ను తనిఖీ చేసుకోవచ్చని అందుకు తానే అనుమతులు ఇప్పిస్తానని తెలిపారు.

చెవిరెడ్డి తప్పుపై ఆలోచించండి: పులివర్తి నాని

తిరుపతి, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి): చెవిరెడ్డి చేసింది తప్పు కాదా? అని మాత్రమే ఆలోచించండి. మనకి కూడా ఆడబిడ్డలు ఉన్నారు. మీవిజ్ఞతకే వదిలేస్తున్నా' అని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని వ్యాఖ్యానించారు. ఎర్రావారిపాళెం మండలం యల్లమంద ఘటనపై బాలిక తండ్రితో కలిసి వైసీపీ నేతలు భూమన కరుణాకరరెడ్డి, నారాయణస్వామి ఆదివారం మీడియాతో మాట్లాడిన వ్యవహారంపై సోమవారం నాని స్పందించారు. యల్లమంద ఘటన సమయంలో రమణతో కలసి ఆయన కోడలు మాట్లాడిన వీడియోలను మీడియాకు చూపించారు. ఫిర్యాదుదారుల గొంతు నొక్కేస్తే సుమోటాగా కూడా తీసుకునే అవకాశం పోక్సో కేసులకు ఉందన్న విషయం వైసీపీ నేతలు గుర్తుపెట్టుకోవాలన్నారు. గత ఐదేళ్లుగా చెవిరెడ్డిపై పోరాటం చేస్తున్నానని, భూమనకు శిష్యుడునని చెప్పుకునే చెవిరెడ్డి ఆయన పట్ల ఎలా నడుచుకుంటున్నారో కూడా అందరికీ తెలుసన్నారు. పోలీసులు కక్షసాధింపుగా కేసులు పెడుతున్నారని చెప్పడం సరికాదన్నారు. ఇంకా వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గంలో అనవసరంగా 37 మంది టీడీపీ నాయకులపై చెవిరెడ్డి కేసులు పెట్టించారని గుర్తుచేశారు. ఆడబిడ్డకు అన్యాయం జరిగిందా? లేదా? అని మాత్రమే ఆలోచించాలన్నారు. సాక్ష్యాలు అనేవి ఖచ్చితంగా ఉంటాయని, న్యాయవ్యవస్థ ఎవరికి అన్యాయం జరిగిందో వారిని కాపాడి తీరుతుందన్నారు.

రఘురామకృష్ణరాజుపై థర్డ్ డిగ్రీ కేసు..

ప్రభావతి ముందస్తు బెయిల్‌పై విచారణ

అమరావతి, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి): ప్రస్తుత ఏపీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన కేసులో అప్పటి ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి వేసిన ముందస్తు బెయిల్‌పై మంగళవారం జిల్లా కోర్టులో విచారణకు వచ్చింది. ఈ కేసులో తమను ఇంప్లీడ్ చేయాలని రఘురామ కృష్ణ రాజు పిటిషన్ వేశారు. రఘురామ తరపున హైకోర్ట్ న్యాయవాది వీవీ లక్ష్మీనారాయణ పిటిషన్ వేశారు. రఘురామపై థర్డ్ డిగ్రీ ప్రయోగంలో ప్రభావతి కూడా హత్యాయత్నంలో భాగస్వాములు అయ్యారని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. రఘు రామ కృష్ణం రాజును పరీక్షించిన వైద్య బృందం ఆయన కాలుపై బలమైన దెబ్బలు ఉన్నాయని నివేదిక ఇచ్చారని న్యాయవాది తెలిపారు. ఆయన రెండు కాళ్ళకు బలమైన దెబ్బలతో పాటు వాచి ఉన్నాయని పిటిషనర్ వెల్లడించారు. వైద్య బృందం ఇచ్చిన నివేదికను టాంపరింగ్ చేశారని, అందుకు భిన్నంగా నివేదిక ఇవ్వడం లో ప్రభావతి కీలక పాత్ర పోషించారని ఆరోపించారు. బైపాస్ సర్జరీ చేయించకున్న అని చెప్పినప్పటికీ గుండెలపై కూర్చొని బాధారని చెప్పినప్పటికీ ప్రభావతి ఈ అంశాన్ని తొక్కి పెట్టారని పిటిషన్‌లో పేర్కొన్నారు. అందువలనే ఆమెకు ముందస్తు బెయిల్ ఇవ్వొద్దని పేర్కొంటూ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఇంప్లీడ్ పిటిషన్‌ను అనుమతించాలని న్యాయవాది వీవీ లక్ష్మీనారాయణ కోరారు. కాగా.. 2021 మే నెలలో సీఐడీ అధికారులు కస్టడీకి తీసుకుని చిత్రహింస పలకు గురిచేసి, హత్యాయత్నం చేశారని ఈ ఏడాది జూలైలో రఘురామ రాజు ఫిర్యాదు చేశారు.

రాజధాని నిర్మాణ పనులకు గ్రీన్ సిగ్నల్

రూ.11 వేల కోట్ల కేటాయింపు

ఆమోదం తెలిపిన సీఆర్డీయే అథారిటీ

అమరావతి,డిసెంబర్3 (ఋషి ప్రతినిధి): ఏపీ రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులు చకచకా గాడిలో పడుతున్నాయి. రాజధాని అమరావతిలో కీలక పనులను పున:ప్రారంభించేందుకు సీఆర్డీఏ అథారిటీ సమావేశం

తమిళనాడులో 'ఫంగల్' విధ్వంసం

పరిస్థితులపై ఎంకే స్టాలిన్‌తో ప్రధాని ఆరా

అన్ని విధాలా సాయం చేస్తామని హామీ

విల్లుపురం, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి): 'ఫంగల్' తుఫాను తమిళనాడులో భారీ విధ్వంసం సృష్టించింది. భారీ వర్షాలు, తుఫాను కారణంగా వరదలు రాష్ట్రంలో భారీ నష్టం కలిగించాయి. ఈ బీభత్సంలో చాలా మంది మరణించారు. రాష్ట్రంలో సంభవించిన విపత్తు, అక్కడి పరిస్థితులపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. రాష్ట్రానికి అన్ని విధాలా సాయం చేస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. మంగళవారం ముఖ్యమంత్రి స్టాలిన్‌తో ప్రధాని మోదీ మాట్లాడారని, రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వరదల పరిస్థితిపై సమాచారం అందుకున్నారని ప్రభుత్వానికి సంబంధించిన అధికారిక వర్గాలు తెలిపాయి. స్టాలిన్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.తమిళనాడులోని ఉత్తర ప్రాంతంలోని విల్లుపురం జిల్లాలో సోమవారం భారీ నుంచి అతిభారీ వర్షాల కారణంగా అపూర్వమైన వరదలు సంభవించాయి. వంతెనలు, రోడ్లు నీటమునిగడంతో పలు గ్రామాలు, నివాస కాలనీలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేల ఎకరాల్లో వేసిన పంటలు కూడా నీట మునిగాయి. ఇదిలా ఉండగా, తిరువణ్ణామలైలో డిసెంబర్ 1 రాత్రి కురిసిన వర్షాల సమయంలో బురద జారడం, కొండపై నుండి పడిన రాయి కారణంగా ఐదు మృతి చెందారు. అంతకుముందు సోమవారం ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ, ఫెంగల్ తుఫాను రాష్ట్రంలో భారీ విధ్వంసం సృష్టించిందని అన్నారు. 2,000 కోట్ల మధ్యంతర సాయాన్ని వెంటనే విడుదల చేయాలని ప్రధాని మోదీని కోరారు. దెబ్బతిన్న మౌలిక సదుపాయాలు, జీవనోపాధిని తాత్కాలిక పునరుద్ధరణకు పరిపాలన ద్వారా ఈ మొత్తాన్ని ఉపయోగిస్తామని ఆయన చెప్పారు.ఫెంగల్ తుఫాను గత నెల నవంబర్ 23న అల్పపీడనంగా ఏర్పడి దక్షిణాది రాష్ట్రమైన తమిళనాడులోని 14 జిల్లాల్లో భారీ విధ్వంసం సృష్టించింది. తొలుత తిరువారూరు, తంజావూరు, మైలాడుతురై, నాగపట్నం జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయని ప్రధాని మోదీకి రాసిన లేఖలో సీఎం స్టాలిన్ తెలిపారు.దీంతో పాటు రాజధాని చెన్నై, తిరువళ్లూరు, చెంగల్‌పట్టు, కాంచీపురం, విల్లుపురం తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఆ తర్వాత డిసెంబర్ 1న ఈ ప్రాంతాల్లో తుపాను తాకడంతో కడలూరు, కళ్లకురిచ్చి, విల్లుపురం, తిరువణ్ణామలైలో రోడ్లు, విద్యుత్ లైన్లకు భారీ నష్టం వాటిల్లింది. గంటకు 90 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయడంతో పలుచోట్ల నేలకొరిగాయి. దీంతో పాటు అంతర్భాగంలోని ధర్మపురి, రాణిపేట, కృష్ణగిరి, వేలూరు, తిరుపత్తూరు జిల్లాల్లో కూడా భారీ వర్షాలు, వరదల వల్ల భారీ నష్టం వాటిల్లింది. ఈ ప్రకృతి వైపరీత్యం కారణంగా దాదాపు 69 లక్షల కుటుంబాలు, 1.5 కోట్ల మంది ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. సిఎం స్టాలిన్ ప్రకారం, తిరువణ్ణామలై, విల్లుపురం, కళ్లకురిచి జిల్లాల్లో ఒక్క రోజులో మొత్తం సీజన్ సగటు (50 సెం.మీ కంటే ఎక్కువ) కు సమానమైన వర్షపాతం నమోదైంది. దీని కారణంగా ఇక్కడ వరదలు వంటి పరిస్థితి ఏర్పడింది. మౌలిక సదుపాయాలు, పంటలకు భారీ నష్టం జరిగింది. ఈ జిల్లాల్లో సహాయ, సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు సీనియర్ మంత్రులు, అధికారులను నియమించగా, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్‌ఎఫ్) 9 బృందాలు, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డిఆర్‌ఎఫ్) 9 బృందాలను మోహరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నష్టాలను ప్రాథమికంగా అంచనా వేసినప్పుడు తాత్కాలిక పునరుద్ధరణ ప్రయత్నాలకు దాదాపు రూ.2,475 కోట్లు అవసరమని తేలిందని సీఎం చెప్పారు.

ఢిల్లీకి రావాలంటే విసుగు కలుగుతోంది!

కాలుష్యం కారణంగా ఇన్‌ఫెక్షన్ సోకుతుంది

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,డిసెంబర్3 (ఋషి ప్రతినిధి): దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యస్థాయి తీవ్రంగా పెరుగుతుండటంతో ఇక్కడకు రావాలంటేనే విసుగు కలుగుతోందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. తనకు ఢిల్లీలో నివసించడం ఏమాత్రం ఇష్టం ఉండదన్నారు. కాలుష్యం కారణంగా ఇన్‌ఫెక్షన్ సోకుతుండటంతో తనకు ఢిల్లీకి రావాలనిపించడం లేదన్నారు. ఢిల్లీలో కాలుష్యం బాగా ఉందన్నారు.తాను ఢిల్లీకి వచ్చే ప్రతిసారీ కాలుష్యం భయంతో వెళ్లాలా? వద్దా? అని ఆలోచిస్తుంటానన్నారు. శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించడమే కాలుష్య నివారణకు ఉత్తమ మార్గమన్నారు. మన దేశం ప్రస్తుతం రూ.22 లక్షల కోట్ల విలువైన శిలాజ ఇంధనాలను దిగుమతి చేసుకుంటోందన్నారు. లక్షల కోట్ల విలువైన దిగుమతుల నేపథ్యంలో ఈ ప్రభావం మన ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, జీవావరణంపై పడుతోందన్నారు. ప్రత్యామ్నాయ ఇంధనాలను ప్రోత్సహించడం ద్వారా శిలాజ ఇంధనాల దిగుమతులను తగ్గించుకోవచ్చని వ్యాఖ్యానించారు.

వారాంతాల్లోనూ సభ!

సభ్యులకు లోక్‌సభ స్పీకర్ హెచ్చరికలు

హైదరాబాద్, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి): పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమై ఆరు రోజులవుతున్నా.. ఎలాంటి చర్చలూ జరగడం లేదు. ఉభయసభల్లో నిత్యం వాయిదాల పర్వం కొనసాగుతోంది. ఎలాంటి చర్చలూ జరగకుండానే ఉభయ సభలు వాయిదాలు పడుతూ వస్తున్నాయి. అయితే, మంగళవారం మాత్రం సభా కార్యక్రమాలు సజావుగా సాగుతున్నాయి. విపక్ష ఎంపీలు ఆందోళన చేస్తున్నప్పటికీ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సభ్యులకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కీలక హెచ్చరికలు చేశారు. వాయిదాల కారణంగా సభా కార్యకలాపాలకు మరింత అంతరాయం కలిగితే.. వారాంతాల్లోనూ సభను సమావేశపర్చాల్సి ఉంటుందని హెచ్చరించారు. కాగా, పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఉభయ సభల్లోనూ ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య ఏర్పడిన ప్రతిష్టంభనకు తెరపడింది. భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభ ఆమోదించి 75 సంవత్సరాలు అవుతున్న తరుణంలో లోక్‌సభలో, రాజ్యసభలో రాజ్యాంగంపై చర్చ జరిపేందుకు ప్రభుత్వం, ప్రతిపక్షాలు సోమవారం ఓ అంగీకారానికి వచ్చాయి. డిసెంబర్ 13, 14 తేదీల్లో దిగువ సభలో, డిసెంబర్ 16, 17 తేదీల్లో ఎగువ సభలో రాజ్యాంగంపై చర్చ ఉంటుంది.

ఢిల్లీలోని ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

తీవ్ర ఆందోళన చెందిన స్థానికులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి): దేశ రాజధాని ఢిల్లీలోని ఓ ఫోమ్ ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈశాన్య ఢిల్లీలోని కరవాల్ నగర్ ఏరియాలో ఈ ప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీ నుంచి పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. స్థానికులు సమాచారం మేరకు ఘటనా ప్రాంతానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పుతున్నారు. అగ్నిప్రమాదం జరిగిందన్న సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని ఫైరింజన్‌ల సాయంతో మంటలు ఆర్పుతున్నామని, మంటలు ఇంకా పూర్తిగా అదుపులోకి రాలేదని అగ్నిమాపక సిబ్బంది చెప్పారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

భారత్, చైనా మధ్య సంబంధాలు బలోపేతం

సరిహద్దుల్లో కలసి నడుస్తున్న ఇరు దేశాలు

లోక్‌సభకు వెల్లడించిన విదేశాంగ మంత్రి జైశంకర్

న్యూఢిల్లీ, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి):గతంలో కొంత మందగించినప్పటికీ, భారత్-చైనా సంబంధాలు ఇటీవల కొంత మెరుగయ్యాయని విదేశాంగశాఖ మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. చైనా చర్యల కారణంగా 2020లో సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతతకు భంగం వాటిల్లిందని, అప్పటినుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయన్నారు. సరిహద్దులో శాంతి, స్థిరత్వం లేకుండా ఇరు దేశాల సంబంధాలు సాధారణంగా ఉండలేవని మన ప్రభుత్వం స్పష్టంగా పేర్కొందన్నారు. వీటికి సంబంధించి భారత్‌కు స్పష్టమైన వైఖరి ఉందన్న ఆయన.. న్యాయమైన, సహేతుక, పరస్పర ఆమోదయోగ్య పరిష్కారం కోసం చైనాతో చర్చలు జరిపేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు.లాజిస్టికల్ సవాళ్లు, కొవిడ్ పరిస్థితులు ఉన్నప్పటికీ.. మన బలగాలు చైనాను కట్టడి చేశాయని చెప్పారు. అయితే, నిరంతర దౌత్య చర్చల ఫలితంగా ఇరుదేశాల మధ్య సంబంధాల్లో ఇటీవల కొంత మెరుగుదల కనిపించిందని లోక్‌సభలో వివరించారు. 'ఏప్రిల్-మే 2020లో తూర్పు లద్దాఖ్‌లోని అనేక ప్రాంతాల్లో చైనా భారీ సంఖ్యలో బలగాలను మోహరించడం తీవ్ర ఘర్షణకు దారితీసింది. గల్వాన్ లోయలో ఘర్షణల అనంతరం సరిహద్దు గస్తీ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. లాజిస్టికల్ సవాళ్లు, కొవిడ్ పరిస్థితులు ఉన్నప్పటికీ.. మన బలగాలు వేగంగా, సమర్థవంతంగా స్పందించి చైనాను కట్టడి చేశాయి. ఇలా తమ సామర్థ్యాలతో ఓ వైపు దీటుగా ప్రతిస్పందిస్తూనే, ఉద్రిక్తతలు తగ్గించడం కోసం పొరుగు దేశంతో దౌత్యపరమైన చర్చలకు ప్రయత్నాలు చేశాం' అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

తాజ్‌మహల్‌కు బాంబు బెదిరింపు

ఉత్తరప్రదేశ్ టూరిజం కార్యాలయానికి ఈమెయిల్

అప్రమత్తమైన టూరిజం అధికారులు, పోలీసులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి): గత కొంతకాలంగా బాంబు బెదిరింపు కాల్స్ ఎక్కువయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు దేశంలోని పలు విమానాశ్రయాలు, విమానాల్లో బాంబు ఉన్నట్టుగా బెదిరింపు కాల్స్ చేసిన ఘటనలు అనేకం వెలుగులోకి వచ్చాయి. దుండగుల బెదిరింపు కాల్స్‌తో అటు ప్రజలు, ఇటు అధికార యంత్రాంగాన్ని టెన్షన్‌లో పడేస్తుంటారు. తాజాగా ప్రపంచంలోని ఏడు వింతల్లో ఒకటైన తాజ్ మహల్‌కు బాంబు బెదిరింపు మెయిల్ రావటం కలకలం రేపింది. తాజ్ మహల్ ను పేల్చివేస్తామంటూ ఉత్తరప్రదేశ్ టూరిజం కార్యాలయానికి ఓ ఈమెయిల్ అందింది. వెంటనే అప్రమత్తమైన టూరిజం అధికారులు, పోలీసులు రంగంలోకి దిగారు. ఆగ్రాలోని తాజ్ మహల్‌ను బాంబులతో పేల్చేస్తామని గుర్తు తెలియని వ్యక్తులు మెయిల్ చేసినట్టుగా అధికారులు వెల్లడించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. తాజ్ మహల్ వద్ద బాంబ్ డిస్పోజల్ టీమ్‌లు, డాగ్ స్క్వాడ్స్‌తో రంగంలోకి దిగారు. తాజ్‌మహల్ పరిసర ప్రాంతాల్లో బాంబు స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్, ఇతర బృందాలు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాయి. కానీ అక్కడ అనుమానస్పద వస్తువులు ఏమీ కూడా కనిపించలేదని అధికారులు వెల్లడించారు. తాజ్‌మహల్‌కు వచ్చిన బెదిరింపు మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందనే దానిపై విచారణ చేస్తున్నామని ఏసీపీ తాజ్ సెక్యూరిటీ సయ్యద్ అరీబ్ అహ్మద్ తెలిపారు. నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మెయిల్ వచ్చిన వెంటనే ఆగ్రా పోలీసులకు, ఇతర ఉన్నతాధికారులకు సమాచారం అందించామని ఉత్తరప్రదేశ్ డిప్యూటీ డైరెక్టర్ దీప్తి వాత్స పేర్కొన్నారు.

సీనియర్ సిటిజన్లకు ఆదాయపు పన్ను రాయితీ లేదు

లోక్‌సభలో మంత్రి పంకజ్ చౌదరి స్పష్టీకరణ

న్యూఢిల్లీ,డిసెంబర్3 (ఋషి ప్రతినిధి): సీనియర్ సిటిజన్లకు ఆదాయపు పన్ను రాయితీ కల్పించే ప్రతిపాదన ఏదీ పరిశీలనలో లేదని కేంద్ర ప్రభుత్వం ఇటీవల స్పష్టం చేసింది. ఆదాయపు పన్ను చట్టంలో సవరణలు కోరుతూ అనేక ప్రతిపాదనలు, బడ్జెట్ కసరత్తులో భాగంగా ప్రతి సంవత్సరం స్వీకరిస్తారు. అయితే ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో సీనియర్ సిటిజన్లకు సంబంధించిన మినాహాయింపుల వంటి ప్రతిపాదనలేవి పరిశీలనలో లేవని ఇటీవల పేర్కొన్నారు. రాష్ట్ర వృద్ధుల సంక్షేమ సంఘాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుండి సీనియర్ సిటిజన్ల కోసం ఆదాయపు పన్ను సవరణను కోరుతున్నాయా?, అలాగే సీనియర్ సిటిజన్లకు వార్షిక ఆదాయం రూ.7.5 లక్షల వరకు పన్ను రాయితీ కల్పించాలని, రూ.10 లక్షల వార్షిక ఆదాయం వరకు 5 శాతం ఆదాయపు పన్ను విధించాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తుందా?, సీనియర్ సిటిజన్ల జాతీయ పొదుపు ధృవీకరణ పత్రం పెట్టుబడిపై పన్ను మినహాయింపు ఈ ఆర్థిక సంవత్సరం నుండి రూ. 1.5 లక్షల నుండి రూ. 3 లక్షలకు సవరించబడుతుందా? అని సభ్యులు అడిగిన ప్రశ్నలేవి ప్రతిపాదనల్లో లేవని స్పష్టం చేశారు. రేంద్ర మోడీ 3.0 ప్రభుత్వం వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్ కోసం దేశం ఆసక్తిగా ఎదురు చూస్తున్న నేపథ్యంలో సీనియర్ సిటిజన్లకు విషయంలో స్పష్టత వచ్చిందని ఆర్థిక నిపుణులు పేర్కొన్నారు. సాధారణంగా ఆర్థిక మంత్రి ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. జూలైలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మోడీ ప్రభుత్వం జూలైలో ఆవిష్కరించిన కేంద్ర బడ్జెట్‌లో అనేక పన్ను మార్పులను ప్రకటించింది. కొత్త పన్ను విధానంలో జీతం పొందే ఉద్యోగులకు ఆర్థిక సంవత్సరంలో రూ. 17,500 వరకు పొదుపు ఉండేలా బడ్జెట్‌లో పన్ను రేటు నిర్మాణంలో కొన్ని మార్పులు చేశారు. ఉద్యోగులకు లభించే స్టాండర్డ్ డిడక్షన్‌ను 50 శాతం పెంచి రూ. 75,000కి పెంచారు. పెన్షనర్లకు కుటుంబ పెన్షన్‌పై తగ్గింపును రూ. 15,000 నుండి రూ. 25,000కి పెంచారు. సుమారు నాలుగు కోట్ల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం చేకూర్చేందుకు గత బడ్జెట్ చర్యలు తీసుకున్నారు. అలాంటి చర్యలేవి ఈ బడ్జెట్‌లో ఉండే అవకాశం లేదని నిపుణులు అంచనా వేస్తున్నారు.

అయోధ్యలో జరుగుతున్న పెండింగ్ పనులు

లక్నో, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి): ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో గల రామ మందిరం సముదాయంలో పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న సూర్య మందిరం, గణేష్ మందిరం, శివ మందిరం, దుర్గా మందిరం, అన్నపూర్ణ మందిర్, హనుమాన్ మందిర్‌ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ మేరకు నిర్మాణాలకు సంబంధించిన చిత్రాలను ఆలయ ట్రస్ట్ తాజాగా విడుదల చేసింది. కాగా, ఆలయ నిర్మాణాన్ని 2025 జూన్‌కు పూర్తి చేయాలని ముందుగా నిర్ణయించారు. కానీ, పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలు సెప్టెంబర్ 2025 వరకు పూర్తి కానున్నట్లు కన్‌స్ట్రక్షన్ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా ఇప్పటికే వెల్లడించిన విషయం తెలిసిందే. వర్షర్ల కొరత, బండల పని పూర్తి కాని నేపథ్యంలో.. ఆలయ శిఖర నిర్మాణంలో ఆలస్యం అవుతున్నట్లు చెప్పారు. సుమారు 200 మంది కార్మికులు షార్టేజ్ ఉన్నట్లు ఆయన తెలిపారు. కాగా, ఈ ఏడాది జనవరి 22న రామాలయంలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగిన విషయం తెలిసిందే. రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ జరిగిన ఏడాది కావొస్తోంది. ఈ నేపథ్యంలో ప్రాణ ప్రతిష్ఠ వార్షికోత్సవాన్ని జరుపుకోవాలని ట్రస్ట్ నిర్ణయించింది. అయితే, పౌష్ శుక్ల ద్వాదశి కారణంగా జనవరి 22న కాకుండా 11న ప్రాణ ప్రతిష్ఠ వార్షికోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించింది.

ఆరోగ్యంగానే ఉన్నా: షిండే

ముంబై, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి): తాను ఆరోగ్యంగానే ఉన్నానని, కేవలం వైద్య పరీక్షల కోసమే ఇవాళ ఆస్పత్రికి వెళ్లానని మహారాష్ట్ర కేర్‌టేకర్ సీఎం ఏక్‌నాథ్ షిండే వెల్లడించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడి 10 రోజులవుతున్నా కొత్త సీఎం ఎంపికపై ఇంకా సస్పెన్షన్ కొనసాగుతున్న వేళ ఆయన ఆస్పత్రిలో చేరడం పలు అనుమానాలకు తావిచ్చింది. సీఎం పదవిని బీజేపీకి వదులుకోవడం ఇష్టం లేకనే షిండే డ్రామాలు ఆడుతున్నారని ప్రచారం జరిగింది. ఈ క్రమంలో ఆయన ఆస్పత్రి నుంచి బయటకు రాగానే తాను ఆరోగ్యంగానే ఉన్నానంటూ ప్రకటన చేశారు. కేవలం వైద్య పరీక్షల కోసమే ఆస్పత్రిలో చేరానని చెప్పారు. కాగా మహారాష్ట్ర సీఎం ఎంపికపై ఇంకా సస్పెన్షన్ కొనసాగుతోంది. కూటమిలో అతిపెద్ద పార్టీ అయిన బీజేపీకే ఈసారి సీఎం పదవి దక్కుతుందని, సీఎంగా ఫడ్నవీస్ పేరును బీజేపీ ఖాయం చేసిందని వార్తలు వినిపిస్తున్నా.. ఈ వార్తలపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. అయితే కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని, సీఎం పదవిపై బీజేపీ హైకమాండ్ తీసుకునే నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని ఇటీవల ఏక్‌నాథ్ షిండే ప్రకటించడంతో ఫడ్నవీస్‌కు సీఎం పదవి పక్కా అనేది తేలిపోయింది. దీనిపై బుధవారం అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. బుధవారం మహారాష్ట్ర బీజేపీ శాసనసభా పక్షం సమావేశమై సీఎంను ఎన్నుకోనుంది. ఈ సమావేశానికి గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ బీజేపీ కేంద్ర పరిశీలకులుగా హాజరుకానున్నారు.

బీజేపీ నిర్ణయం మార్చుకోదు:రాందాస్ అథవాలే

మహారాష్ట్ర ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ముందు మూడు దారులు ఉన్నాయని ఆర్పీఐ అధినేత, కేంద్రమంత్రి రాందాస్ అథవాలే అన్నారు. ఉపముఖ్యమంత్రి పదవిని తీసుకోవడం లేదా మహాయుతి కూటమి చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించడం లేదా కేంద్ర ప్రభుత్వంలో స్థానం కోరుకోవడం... ఈ మూడింటిలో ఏదో ఒకటి ఆయన ఎంచుకోవాలన్నారు. ఈసారి బీజేపీయే ముఖ్యమంత్రి పదవిని తీసుకుంటుందని అథవాలే స్పష్టం చేశారు. ఆపద్ధర్మ సీఎంగా ఉన్న షిండేకు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చే అవకాశముందన్నారు.క్రితంసారి శివసేన పార్టీ రెండుగా చీలిపోయినప్పుడు బీజేపీకి ఎక్కువ బలం ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి పీఠాన్ని ఏక్?నాథ్ షిండేకు ఇచ్చారని గుర్తు చేశారు. బీజేపీ అధిష్ఠానం నిర్ణయాన్ని గౌరవించి ఫడ్నవీస్ డిప్యూటీ సీఎంగా కొనసాగారన్నారు. కానీ ఈసారి కూడా సీఎం పదవిని శివసేనకు ఇచ్చేందుకు బీజేపీ సిద్ధంగా లేదని స్పష్టం చేశారు. బీజేపీ గతంలో కంటే ఈసారి ఎక్కువ స్థానాలను గెలుచుకుందన్నారు.మరోసారి ముఖ్యమంత్రి పదవిని ఇచ్చేందుకు మహాయుతి కూటమిలోని బీజేపీ అధిష్ఠానం సుముఖత వ్యక్తం చేయకపోవడంతో ఏక్‌నాథ్ షిండే కలత చెందిన మాట వాస్తవమే అన్నారు. అయినప్పటికీ బీజేపీ తన నిర్ణయాన్ని మార్చుకునే పరిస్థితి లేదన్నారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమికి 230 సీట్లు రాగా... అందులో బీజేపీ 132, శివసేన 57, ఎన్సీపీ 41 సీట్లు దక్కించుకున్నాయి.

మహారాష్ట్రలో ఆశ్చర్యకర రాజకీయ పరిణామాలు

"షిండే మళ్లీ సీఎంగా రావాలి" అంటూ బ్యానర్లు

బాంబే,డిసెంబర్3 (ఋషి ప్రతినిధి): మహారాష్ట్రలో గురువారం నాడు నూతన ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవానికి ఓవైపు ఏర్పాట్లు జరుగుతున్నప్పటికీ, సీఎం పదవి విషయంలో అనిశ్చితి కొనసాగుతూనే ఉంది. ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంగా ఏక్ నాథ్ షిండే... వీలైతే మరో డిప్యూటీ సీఎంగా అజిత్ వార్... ప్రస్తుతానికి ఈ సమీకరణం ప్రచారంలో ఉంది. బీజేపీ హైకమాండ్ చెప్పిన మాట వింటానని ఏక్ నాథ్ షిండే చెబుతున్నప్పటికీ, షిండేనే మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని బ్యానర్లు వెలిశాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఇదొక ఆసక్తికర పరిణామం. తాజాగా ఛత్రపతి శంభాజీ నగర్ లో షిండే బొమ్మతో భారీ బ్యానర్లు, హోర్డింగ్‌లు దర్శనమిచ్చాయి. ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండేనే మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలంటూ ఆ బ్యానర్లపై పేర్కొన్నారు. అంతేకాదు, షిండేను 'మరాఠా సర్దార్' అని అభివర్ణించారు.

తిరుపతిలో విరిగిపడ్డ కొండచరియలు

తిరుపతి, డిసెంబర్ 3 (ఋషి ప్రతినిధి): తిరుమలలో కొండ చర్యలు విరిగిపడ్డాయి. మట్టి, బండరాళ్లు రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. రెండో ఘాట్ రోడ్డులోని లింక్ రోడ్డు దగ్గర ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో అటు వైపు వెళ్లే ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంటనే సమాచారం అందుకున్న టీటీడీ, ఫారెస్ట్ సిబ్బంది వాటిని తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. చిత్తూరు జిల్లాపై ఫెంగల్ తుఫాన్ తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఫెంగల్ దెబ్బతో జనజీవనం అతలాకుతలం అవుతోంది. భారీ వర్షాలకు పలు రోడ్డు దెబ్బతిన్నాయి. ఇప్పటికే చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో రవాణా వ్యవస్థ స్తంభించింది. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వరి, టమాటా, అరటి, కూరగాయ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. దాదాపు 1500 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది.దాదాపు 1500 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. కల్లాల్లో వరి పంట తడిసి మొలకెత్తుతోన్న పరిస్థితి ఏర్పడింది. నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కొండగట్టు అంజన్నను దర్శించుకున్న వరుణ్‌తేజ్

కొండగట్టు అంజన్న ఆలయాన్ని మెగా హీరో వరుణ్ తేజ్ సందర్శించారు. మంగళవారం ఉదయం ఆలయం వద్దకు చేరుకున్న వరుణ్ తేజ్‌కు అర్చకులు, అధికారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో వరుణ్ తేజ్ ప్రత్యేక పూజలు చేశారు. దర్శనానంతరం స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంజన్నను దర్శించుకోవడం ఆనందంగా ఉందని వరుణ్ తేజ్ తెలిపారు. కాగా, వరుణ్ తేజ్ కాంపౌండ్ నుంచి పీరియాడిక్ బ్యాక్ డ్రాప్‌లో వచ్చిన చిత్రం మట్కా . పలాస 1978 ఫేం డైరెక్టర్ కరుణకుమార్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి ఫీమేల్ లీడ్ రోల్స్‌లో నటించారు. తెలుగు, తమిళంతోపాటు వివిధ భాషల్లో భారీ అంచనాల మధ్య నవంబర్ 14న గ్రాండ్‌గా రిలీజైన ఈ చిత్రం డిజాస్టర్‌గా నిలిచింది. వరుణ్ తేజ్ పర్‌ఫార్మెన్స్ పరంగా అదరగొట్టినా.. కథనం బెడిసి కొట్టడంతో బాక్సాఫీస్ వద్ద ఊహించని ఫ్లాప్ టాక్ మూటగట్టుకుంది. థియేటర్స్‌లోకి వచ్చి నెలరోజులు కూడా కాకుండానే ఓటీటీ రిలీజ్‌కు సిద్ధమైంది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ సినిమా డిసెంబర్ 05 నుంచి తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది.

శివాజీగా రిషబ్‌శెట్టి

కాంతార సినిమాతో కన్నడ, తెలుగుతోపాటు పాన్ ఇండియా బాక్సాఫీస్ వద్ద టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచాడు హీరో రిషబ్ శెట్టి . ఈ స్టార్ యాక్టర్ ఇప్పటికే ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో జై హనుమాన్ చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా మరో క్రేజీ బయోపిక్‌తో అందరినీ సర్‌ప్రైజ్ చేస్తున్నాడు. రిషబ్ శెట్టి నటిస్తోన్న బయోపిక్ శివాజీ మహారాజ్. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఖడ్గం చేత బట్టిన శివాజీ మహారాజ్‌గా వీరత్వం ఉట్టిపడే లుక్‌లో క్యూరియాసిటీ పెంచేస్తున్నాడు రిషబ్ శెట్టి. లెజెండరీ మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవిత కథ నేపథ్యంలో హిస్టారికల్ డ్రామాగా రాబోతున్న ఈ మూవీని సందీప్ సింగ్ డైరెక్ట్ చేస్తున్నాడు. అంతేకాదు ఈ చిత్రాన్ని 2027 జనవరి 1న విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. ఇది సినిమా కంటే ఎక్కువగా ఉండబోతుంది. అపారమైన అసమానతలను అధిగమించి.. మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదురించి శాశ్వతమైన వారసత్వాన్ని సృష్టించిన యోధుడికి నివాళిగా వస్తోందని మేకర్స్ తెలియజేశారు. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలపై రాబోయే రోజుల్లో క్లారిటీ రానుంది.

పుష్ప-3 కూడా ఉందా..?

పాన్ ఇండియా మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేసిన తెలుగు ప్రాజెక్టుల్లో టాప్‌లో ఉంటుంది అల్లు అర్జున్ నటించిన పుష్ప . ఈ చిత్రం సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ టైటిల్ రోల్‌లో ప్రాంఛైజీగా వస్తోండగా.. ఇప్పటికే పుష్ప ది రైజ్ బాక్సాఫీస్ వద్ద రికార్డుల మోత మోగించింది. తాజాగా పుష్ప 2 ది రూల్ డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.ఇదిలా ఉంటే సీక్వెల్ విడుదలకు ముందే పుష్ప 3పై ఇప్పటికే నెట్టింట వార్తలు రౌండప్ చేస్తున్న విషయం తెలిసిందే. మీరు మీ హీరోను నాకోసం ఇంకో మూడేళ్లు ఇవ్వగలిగే అవకాశముందా..? అని అడగండి. ఉందంటే ఆ తర్వాత పుష్ప 3 చేస్తానంటూ ఇప్పటికే ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో కామెంట్స్ చేశాడు సుకుమార్. ఇదిలా ఉంటే ఎవరూ ఊహించని సర్‌ప్రైజ్ ఇచ్చింది బన్నీ టీం. త్రీక్వెల్ పుష్ప 3 ది ర్యాంపేజ్ టైటిల్‌తో రాబోతుంది. మ్యూజిక్ సిట్టింగ్స్ స్టూడియోలో సుకుమార్ టీం బ్యాక్ డ్రాప్‌లో స్క్రీన్‌పై టైటిల్ లుక్ ఉన్న ఫొటోను షేర్ చేశారు. సీక్వెల్ ఎండింగ్‌లో పుష్ప 3 టీజర్ కూడా ఉండబోతుందని ఇన్‌సైడ్ టాక్. ఇంకేంటి మరి మూవీ లవర్స్‌లో పుష్ప రాజ్ మేనియా మరికొన్నేళ్లపాటు పదిలంగా ఉండబోతున్నట్టు తాజా అప్‌డేట్ క్లారిటీ ఇచ్చేస్తుంది.

టాలీవుడ్ యాక్టర్ పవన్ కల్యాణ్ అభిమానులకు ఇచ్చిన మాట ప్రకారం ఓ వైపు ఏపీ డిప్యూటీ సీఎంగా విధులు నిర్వర్తిస్తూనే.. మరోవైపు సినిమాల షూటింగ్‌లో కూడా పాల్గొంటున్నాడు. ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. వీటిలో ఒకటి జ్యోతి కృష్ణ డైరెక్షన్‌లో వస్తున్న పీరియాడిక్ డ్రామా హరి హర వీరమల్లు. రాజకీయపరమైన బిజీ షెడ్యూల్ మధ్య లాంగ్ టైం పెండింగ్ వర్క్ కోసం కొన్ని గంటలు.. అంటూ సోషల్ మీడియా ద్వారా ఫొటోషూట్‌లో పాల్గొన్న విషయాన్ని షేర్ చేశాడు పవన్ కల్యాణ్. ఇప్పటిదాకా చేసిన వాటి కంటే ఈ ఫొటోషూట్ చాలా ప్రత్యేకం. ఎందుకంటే తాజా షూట్ కోసం భారతీయ తొలి ఫొటోమెట్రిక్ 3 డీ స్కానింగ్ టెక్నాలజీ వినియోగించారు. షూట్‌కు ముందు ఓ సెల్ఫీ కూడా దిగాడు పవన్ కల్యాణ్. రౌండప్ చేసిన లైట్లు, కెమెరాల మధ్య మీసం మెలేస్తున్న హరిహరవీరమల్లు విజువల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. పవన్ కల్యాణ్ త్వరలోనే కొత్త షెడ్యూల్‌లో పాల్గొనబోతున్నాడు. ఈ చిత్రంలో ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. బాలీవుడ్ నటుడు, దర్శక నిర్మాత అనుపమ్ ఖేర్, అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని మార్చి 28న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించారు మేకర్స్.

వీరమల్లులో పవన్ బిజీబిజీ



ప్రాజెక్ట్ జైలర్ 2... వర్క్‌మోడ్‌లో ఇళయరాజా

తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. వీటిలో ఒకటి కోలీవుడ్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్‌తో చేయబోతున్న సీక్వెల్ ప్రాజెక్ట్ జైలర్ 2. ఇప్పటికే కూలీ షూటింగ్‌లో బిజీగా ఉన్న తలైవా ఇక జైలర్ 2 చిత్రీకరణలో కూడా పాల్గొనబోతున్నాడు. తలైవా పుట్టినరోజు సందర్భంగా డిసెంబర్ 12న జైలర్ 2 ప్రోమో రాబోతుందని తెలిసిందే. ఈ నేపథ్యంలో రజినీకాంత్ ఇళయరాజాతో కలిసి దిగిన ఫొటో ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. తలైవా ప్రోమో షూట్ కోసం ఈవీపీ ఫిలిం సిటీకి వెళ్లిన సందర్భంగా ఈ ఫొటో దిగారు. బర్త్ డేన కూలీ న్యూ లుక్ పోస్టర్ కూడా విడుదల చేసేందుకు రెడీ అవుతున్నట్టు ఇన్‌సైడ్ టాక్. జైలర్ 2 స్క్రిప్ట్ వర్క్ పూర్తయిందని నెల్సన్ దిలీప్ కుమార్ ఇప్పటికే క్లారిటీ ఇచ్చాడు.

ఇద్దరి హత్య చేసిన నటి సోదరి

బాలీవుడ్ నటి నర్గీస్ ఫక్రీ సోదరి అలియాను న్యూయార్క్ పోలీసులు అరెస్టు చేశారు. గత నెల మాజీ బాయ్‌ఫ్రెండ్, అతడి స్నేహితురాలిని అలియా సజీవ దహనం చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ కేసులో ఆమెను పోలీసులు అరెస్ట్ చేశారు. న్యూయార్క్‌లో ఉంటున్న అలియా ఫక్రీ కొంతకాలం పాటు ఎడ్వర్డ్ జాకోబ్ అనే యువకుడితో డేటింగ్‌లో ఉంది. పలు కారణాలతో ఏడాది క్రితం విడిపోయారు. అనంతరం జాకోబ్‌కు అనాస్టాసియా ఎటినీ అనే యువతితో పరిచయం ఏర్పడింది. వీరిద్దరూ సన్నిహితంగా ఉంటున్నట్లు తెలుసుకున్న అలియా పలుమార్లు తన మాజీ బాయ్‌ఫ్రెండ్‌పై బెదిరించసాగింది. నవంబరు 2న జాకోబ్ ఆయన స్నేహితులు ఉంటున్న భవనం వద్దకు వెళ్లి ఆ ఇంటికి నిప్పంటించింది. దీన్ని గమనించిన స్థానికులు వారిని అప్రమత్తం చేశారు. అయితే అప్పటికే మంటల్లో చిక్కుకుని వారిద్దరూ ప్రాణాలు విడిచారు. ప్రత్యక్ష సాక్షుల రిపోర్ట్‌తో కేసు నమోదు చేసుకున్న పోలీసులు తాజాగా అలియా ఫక్రీని అరెస్టు చేశారు. ఈ కేసులో ఆమె దోషిగా తేలితే జీవిత ఖైదు పడే అవకాశాలున్నాయి. ప్రస్తుతం ఆమెను రిమాండ్‌కు తరలించారు.

టికెట్ల పెంపుపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబోలో వస్తున్న మూవీ పుష్ప-2. ఈ నెల 5న విడుదల కానున్నది. ఈ క్రమంలో సినిమా టికెట్ల ధరలను నిర్మాతలు భారీగా పెంచారు. పుష్ప-2 మూవీ సినిమా టికెట్ల ధరల పెంపును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలవగా.. న్యాయస్థానం విచారణ జరిపింది. బెనిఫిట్ షో పేరుతో ఒక్కో టికెట్‌కు రూ.800 వసూలు చేస్తున్నారన్న పిటిషనర్ కోర్టుకు తెలిపారు. మొదటి 15 రోజులు సైతం అధికంగా ధరలు వసూలు చేస్తున్నారన్నారు. అయితే, భారీ బడ్జెట్ వల్ల టికెట్ ధరలు పెంచాల్సి వచ్చిందన్న నిర్మాత తరఫు లాయ్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వమే ధరల పెంపునకు అనుమతించింది కదా? అని పిటిషనర్‌ను న్యాయమూర్తి ప్రశ్నించారు. టికెట్ల రేట్ల పెంపుతో అభిమానులపై భారం పడుతుందన్న పిటిషనర్ తరఫు న్యాయవాది.. పెంచిన రేట్లను ఛారిటీలకు, సీఎం, పీఎం సహాయ నిధికి వెళ్లట్లేదన్నారు. పెంచిన రేట్లతో నిర్మాత లబ్ధి పొందుతున్నాడని పిటిషనర్ పేర్కొన్నారు. థియేటర్లలో టికెట్ ధరల కంటే తినుబండారాలు అధికంగా విక్రయిస్తున్నారనరి న్యాయమూర్తి పేర్కొన్నారు. పాప్‌కార్న్, నీళ్ల బాటిళ్లనే అధిక ధరలకు విక్రయిస్తున్నారని న్యాయమూర్తి గుర్తు చేశారు. బెనిఫిట్ షో, అభిమాన సంఘాలకేనన్న నిర్మాతల తరఫు న్యాయవాది.. అభిమాన సంఘాలకు రేట్లు పెంచినట్లుగా వాదనలు వినిపించారు.

పెళ్లి పీటలెక్కనున్న పీవీ సింధు

భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు అతి త్వరలో పెళ్లి పీటలెక్కనున్నారు. హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త వెంకట దత్తసాయిని ఆమె వివాహమాడనున్నారు. రెండు ఒలింపిక్ పతకాల విజేత, ప్రపంచ మాజీ ఛాంపియన్ సింధు పెళ్లి బాజాకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 22న సింధు- దత్తసాయి ఒక్కటికానున్నారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో వైభవంగా వివాహం జరగనుంది. అనంతరం డిసెంబర్ 24న హైదరాబాద్‌లో రిసెప్షన్ జరగనుంది. ఈ నెల 20 నుంచి సింధు పెళ్లి వేడుకలు మొదలు కానున్నాయి. పోసిడెక్స్ టెక్నాలజీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వెంకట దత్త సాయి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కాగా, ఇరు కుటుంబాలకు ఎప్పటినుంచో పరిచయం ఉందని పీవీ సింధు తండ్రి పీవీ రమణ తెలిపారు. నెల కిందటే పెళ్లి ఖాయం చేసుకున్నామని చెప్పారు. వచ్చే ఏడాది జనవరి నుంచి సింధు వరుసగా టోర్నీలు ఆడనుందని, అందుకే డిసెంబర్‌లో పెళ్లి ముహూర్తం పెట్టుకున్నామని పీవీ రమణ చెప్పారు. పెళ్లి వేడుకను ఉదయ్‌పూర్‌లో, రిసెప్షన్‌ను హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా, పీవీ సింధు ఇటీవల రెండేళ్ల తర్వాత అంతర్జాతీయ టైటిల్ గెలుచుకున్న సంగతి తెలిసిందే. 2 సంవత్సరాల 4 నెలల 18 రోజుల తర్వాత టైటిల్ నిరీక్షణకు తెరదించింది. సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ టైటిల్ గెలిచింది.కాగా, పీవీ సింధు 2016 రియో ఒలింపిక్స్‌లో రజతం, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకాలు నెగ్గింది. 2019 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. 2017, 2018 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో రజతం, 2013, 2014లలో కాంస్య పతకాలు నెగ్గింది. ఓవరాల్‌గా అయిదు ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకాలు సాధించింది. కామన్వెల్త్ క్రీడల్లో అయిదు పతకాలు గెలిచింది.

బుమ్రాకు భయపడ్డ మైకేల్ వాన్!

పెర్త్ టెస్టులో జస్ప్రీత్ బుమ్రా అద్భుత ప్రదర్శనతో భారత్ విజయం సాధించి, సిరీస్‌లో 1-0 ఆధిక్యం సంపాదించింది. ప్రపంచంలోని అత్యుత్తమ పేసర్లలో ఒకరైన బుమ్రా, తన వేగం, లైన్, లెంగ్త్‌తో ఆస్ట్రేలియా బ్యాటర్లను ముప్పతిప్పలు పెట్టాడు. ఈ సందర్భంలో ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్, బుమ్రాను ఎదుర్కోవడానికి ఒక సరళమైన మార్పు అవసరం అని పేర్కొంటూ, ఆస్ట్రేలియా తప్పిదాల నుంచి ఇంగ్లండ్ నేర్చుకోవాలని సూచించారు. 2025లో ఇంగ్లండ్ భారత్‌లో సుదీర్ఘ పర్యటన చేపట్టనుంది, ఇందులో 5 టెస్టులు, 5 టీ20లు, 3 వన్డేలు ఉంటాయి. ఈ సిరీస్‌లో బుమ్రా కీలక పాత్ర పోషిస్తాడని ఊహిస్తూ, వాన్ ఇంగ్లండ్ బ్యాటింగ్ ఆర్డర్‌లో ఎడమచేతి వాటం బ్యాటర్లను సమర్థవంతంగా వినియోగించాలని పిలుపునిచ్చాడు. ఆస్ట్రేలియాతో జరిగిన ఒక టెస్ట్ మ్యాచ్‌లో కుడిచేతి వాటం బ్యాటర్లపై బుమ్రా చూపిన ప్రభావాన్ని గుర్తు చేస్తూ, లెఫ్ట్ హ్యాండర్లు ఎక్కువగా ఉండడం అవసరం అని తెలిపారు. వాన్ తన కాలమ్‌లో పేర్కొన్నట్లుగా, బుమ్రా తన వేగంతో కుడిచేతి బ్యాటర్లకు ఎక్కువ ప్రమాదకరంగా మారాడు. ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్, న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్ట్‌లో తమ విజయంలో కీలకపాత్ర పోషించినప్పటికీ, భారత్ పర్యటన సమయంలో అతనికి ముందుభాగంలో మరింత ప్రాధాన్యత కల్పించాలని వాన్ అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలు బుమ్రా ప్రభావాన్ని స్పష్టంగా చూపించగా, జట్టు సమతౌల్యాన్ని సాధించడానికి, బుమ్రా దాడిని తిప్పికొట్టడానికి అందరూ అందుబాటులో ఉన్న వ్యూహాలను పరిశీలిస్తున్నారు.

శివం దూబె విధ్వంసం

గాయం నుంచి కోలుకుని తిరిగొచ్చిన టీమిండియా ఆల్‌రౌండర్ శివమ్ దూబె విధ్వంసం సృష్టించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ముంబై తరఫున బరిలోకి దిగిన దూబె సిక్సర్లతో హోరెత్తించాడు. మంగళవారం సర్వీసెస్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 36 బంతుల్లో అజేయంగా 71 పరుగులు సాధించాడు. ఏకంగా ఏడు సిక్సర్లు, రెండు ఫోర్లు బాదాడు. ఈ ఆల్‌రౌండర్‌ను చెన్నై సూపర్ కింగ్స్ రూ.12 కోట్లు వెచ్చించి రిటైన్ చేసుకున్న విషయం తెలిసిందే. శివమ్ దూబెతో పాటు సూర్యకుమార్ యాదవ్ కూడా అర్ధశతకంతో చెలరేగాడు. 46 బంతుల్లో 70 పరుగులు చేశాడు. ఏడు ఫోర్లు, నాలుగు బౌండరీలు బాదాడు. వీరిద్దరు విరుచుకుపడటంతో పాటు బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో సర్వీసెస్‌పై ముంబై 39 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లకు 192 పరుగులు చేసింది. అయితే ముంబై శుభారంభం దక్కలేదు. 60 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. పృథ్వీ షా మూడు బంతులు ఎదుర్కొని డకౌటయ్యాడు. అజింక్య రహానె (22బీ 18 బంతుల్లో, 3 ఫోర్లు), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (20బీ 14 బంతుల్లో, 4 ఫోర్లు) ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. ఈ స్థితిలో బాదే బాధ్యతలు అందుకున్న సూర్య-దూబె ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. 66 బంతుల్లో నాలుగో వికెట్‌కు 130 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు.అనంతరం ఛేదనకు దిగిన సర్వీసెస్ 19.3 ఓవర్లలో 153 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ మోహిత్ (54బీ 40 బంతుల్లో, 3 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధశతకంతో ఒంటరి పోరాటం చేశాడు. నలుగురు బ్యాటర్లు ఖాతా తెరవలేకపోయారు. కాగా, గత మ్యాచ్‌లో ధారళంగా పరుగులు సమర్పించుకున్న శార్దూల్ ఠాకూర్ నాలుగు వికెట్లతో సత్తాచాటాడు. షామ్స్ ములాని మూడు వికెట్లు తీశాడు. ముంబై జట్టుకు శ్రేయస్ అయ్యర్ సారథి బాధ్యతలు నిర్వర్తిస్తున్న విషయం తెలిసిందే.

స్టీవ్ స్మిత్‌కు గాయం

అడిలైడ్‌లో జరగనున్న డే-నైట్ టెస్టుకు ముందు ఆస్ట్రేలియాకు ఓ బ్యాడ్ న్యూస్ వచ్చింది. దీంతో కీలకమైన పింక్ బాల్ టెస్ట్‌లో ఇబ్బంది పడేలా కనిపిస్తోంది. ఆస్ట్రేలియా స్టార్ బ్యాట్స్‌మెన్ స్టీవ్ స్మిత్ గాయపడ్డాడు. ప్రాక్టీస్ సమయంలో గాయపడడంతో స్మిత్ మైదానాన్ని విడిచిపెట్టాల్సి వచ్చింది. అడిలైడ్ టెస్టు డిసెంబర్ 6 నుంచి ప్రారంభమవుతుంది. ఇటువంటి పరిస్థితిలో, అంతకు ముందు స్మిత్ గాయపడటం ఆస్ట్రేలియా దృక్కోణం నుంచి శుభవార్త కాదని తెలుస్తోంది. స్టీవ్ స్మిత్ ఆస్ట్రేలియా బ్యాటింగ్‌కు

కీలకంగా పేరుగాంచిన సంగతి తెలిసిందే. నెట్స్‌లో బ్యాటింగ్ చేస్తున్న సమయంలో స్మిత్ వేలికి గాయమైంది. మార్స్ లాబుస్చాగ్నే అతనికి త్రో డౌన్ ఇస్తున్న సమయంలో ఇది జరిగింది. గాయపడిన వెంటనే స్మిత్ ఇబ్బంది పడ్డాడు. ఆ తర్వాత అతనికి నెట్స్‌లో సమయం గడపడం కష్టంగా మారింది. దీంతో వెంటనే మైదానాన్ని విడిచిపెట్టాల్సి వచ్చింది. మీడియా నివేదికల ప్రకారం, నెట్స్ నుంచి నిష్క్రమించిన స్మిత్ గాయాన్ని ఫిజియో పరిశీలించారు. అతని గాయం ఎంత తీవ్రంగా ఉందో ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఆస్ట్రేలియా ప్లేయర్లకు గాయం కావడం ఇదే తొలిసారి కాదు. అంతకుముందు జోష్ హేజిల్‌వుడ్ గాయం కారణంగా కంగారూ జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. సైడ్ స్ట్రెయిన్ కారణంగా అడిలైడ్ టెస్టులో ఆస్ట్రేలియా ఈ ఫాస్ట్ బౌలర్ సేవలను పొందడం లేదు. గాయపడక ముందు, స్టీవ్ స్మిత్ పింక్ బాల్‌తో టెస్ట్ మ్యాచ్‌లు ఆడటం గురించి ప్రకటన ఇచ్చాడు. రెడ్ బాల్‌తో పోలిస్తే పింక్ బాల్ ఆడే సమయంలో ఎక్కువ దృష్టి పెట్టాలంటూ చెప్పుకొచ్చాడు. ఈ బంతిని అంచనా వేయడం కష్టం. సీమ్, స్వింగ్ కారణంగా గులాబీ బంతికి వ్యతిరేకంగా బ్యాటింగ్ చేయడం అంత సులభం కాదంటూ తెలిపాడు. డిసెంబర్ 6 నుంచి 10 వరకు అడిలైడ్‌లో భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య పింక్ బాల్ టెస్టు జరగనుంది. ఇందుకోసం ఇరు జట్లు ప్రాక్టీస్‌లో చెమటోడ్చుతున్నాయి. భారత శిబిరం నుంచి శుభవార్త ఏమిటంటే, గాయాల ఆందోళన లేదు. రోహిత్ శర్మ పునరాగమనంతో జట్టు బలం పెరిగింది. భారత కెప్టెన్ ఏ నంబర్‌లో బ్యాటింగ్ చేస్తాడనేది ఆసక్తికరంగా మారింది.

ఆర్సీబీ పగ్గాలు కోహ్లి తిరిగి అందుకుంటాడు

ఐపీఎల్ మెగా వేలం ముగిసింది. జెడ్డా వేదికగా జరిగిన ఆక్షన్‌లో మొత్తంగా 182 మంది ఆటగాళ్ల కోసం 10 ఫ్రాంచైజీలు రూ.639.15 కోట్లు ఖర్చుపెట్టాయి. గత 17 సీజన్లుగా ప్రతిసారి ఫేవరేట్‌గా బరిలోకి దిగి కప్‌ను అందుకోలేక రిక్తహస్తాలతో వెనుదిరుగుతున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఈసారి వేలంలో సంయమనంతో వ్యవహరించింది. తొలిసారి స్టార్ ప్లేయర్ల కోసం పోటీపడకుండా పటిష్టమైన తుదిజట్టు నిర్మాణం కోసం ఆర్సీబీ తీవ్రంగా శ్రమించింది. గతంలో స్టార్లను నమ్ముకుని టైటిల్‌ను అందుకోలేకపోయిన బెంగళూరు మేనేజ్మెంట్ తమ ప్రణాళికలను మార్చుకుంది. దూకుడుగా వ్యవహరించకుండా మెగా వేలంలో ఏకంగా రూ.75 లక్షలను మిగిల్చుకుంది. రెండు ఆర్‌టీఎమ్‌లను ఉపయోగించనే లేదు. మహ్మద్ సిరాజ్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, విల్ జాక్స్‌లను ఆర్‌టీఎమ్‌తో ఆర్సీబీ సొంతం చేసుకోలేదనే పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. అయితే వేలంలో ఆర్సీబీ వ్యవహరించిన తీరును టీమిండియా సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కొనియాడాడు. అలాగే ఆర్సీబీ కెప్టెన్సీ పగ్గాలను విరాట్ కోహ్లి తిరిగి అందుకుంటాడని అభిప్రాయపడ్డాడు. 'వేలంలో ఆర్సీబీ అద్భుతంగా వ్యవహరించింది. బ్యాలెన్స్‌గా ఉంటూ సంయమనంతో ఎదురుచూశారు. ఎన్నో ఫ్రాంచైజీలు భారీ మొత్తంతో వేలంలోకి వచ్చాయి. వాళ్లు వేలంలో దూకుడుగా ముందుకు వెళ్లారు. కానీ ఆర్సీబీ వద్ద ఎంతో డబ్బు ఉన్నప్పటికీ ఓపికగా వ్యవహరించింది. మనకు ఎవరు కావాలి? వాళ్ల కోసం మనం ప్రయత్నించాలి. ఓవరాల్‌గా టీమ్ నాకు ముఖ్యం. 12 నుంచి 14 మంది ఆటగాళ్లు కావాలి. మన పరిస్థితుల్లో పనికొచ్చేలా తీసుకోవాలి. ఆర్‌టీఎమ్‌లు ఉన్నా, అవసరం లేకపోతే ఉపయోగించకూడదు. అంతిమంగా నాకు కావాల్సిన ఆటగాళ్లను దక్కించుకోవాలి..

ఉర్విల్ ఉరుములు

ఫాస్టెస్ట్ సెంచరీలతో రెచ్చిపోతోన్న భారత బ్యాటర్

భారత్ తరపున టీ20 క్రికెట్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన ఉర్విల్ పటేల్.. ఈ ఫీట్ చేసిన 6 రోజుల తర్వాత మరోసారి అద్భుతం సృష్టించాడు. తాజాగా 36 బంతుల్లో సెంచరీ సాధించాడు. ఐపీఎల్ 2025లో అమ్ముడుపోకుండా మిగిలిపోయిన తర్వాత అతని బ్యాట్ నుంచి ఇది రెండవ తుఫాను సెంచరీగా నిలిచింది. ఇటీవల నవంబర్ 27న త్రిపురపై 28 బంతుల్లో సెంచరీ సాధించాడు. టీ20లో అత్యంత వేగవంతమైన సెంచరీ సాధించిన భారత బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. ఇప్పుడు ఉత్తరాఖండ్‌తో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో గుజరాత్ తరపున ఆడిన ఉర్విల్ 41 బంతుల్లో 115 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అతని అద్భుత ఇన్నింగ్స్‌తో గుజరాత్ 41 బంతుల్లో 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఉర్విల్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. దీంతో గుజరాత్ తరపున అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డును తానే బద్దలు కొట్టాడు. ఉర్విల్ రూ. 30 లక్షల బేస్ ధరతో ఐపీఎల్ వేలంలోకి ప్రవేశించాడు. కానీ, ఏ ఫ్రాంచైజీ అతనిపై ఆసక్తి చూపలేదు. దీంతో అతను అమ్ముడుపోలేదు. కానీ, ఇప్పుడు ఫ్రాంచైజీలు అతని తుఫాన్ ఇన్నింగ్స్‌తో చింతిస్తున్నాయి. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. గుజరాత్ తరపున ఆదిత్య తారే అత్యధికంగా 26 బంతుల్లో 54 పరుగులు చేశాడు. అతనికి తోడు రవికుమార్ సమర్థ్ 54 పరుగులు చేశాడు. గుజరాత్‌లో విశాల్ జైస్వాల్ 27 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు.108 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన గుజరాత్ 13.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ పటేల్ 41 బంతుల్లో 115 పరుగులు చేసి సంచలనం సృష్టించాడు. అతను తన తుఫాను ఇన్నింగ్స్‌లో 8 ఫోర్లు, ఒక సిక్స్ కొట్టాడు. అతడితో పాటు కెప్టెన్ అక్షర్ పటేల్ 18 బంతుల్లో 28 నాటౌట్‌గా నిలిచాడు.



మందిర్.. మసీదు.. మరక

నా భరతజాతి చరిత్ర ఘనం అని ప్రపంచానికి చాటినం. మొగలుల చరిత్ర అమోఘం అని ఘోషించారు. తీరా ఇప్పుడు ఆ చరిత్రలోకి తొంగిచూస్తే.. కనిపించేదంతా విధ్వంసమేనా? ఓ మందిరంపై మసీదు చేసిన ధ్వంసమేనా? చదువుకున్న చరిత్ర అంతా చెదలేనా? పుస్తకాల్లో రాసిన అక్షరాలన్నీ 'అంధ'గత్తెలేనా? అబద్ధాలతో ఇటుకలు పేర్చి నిర్మించిన ఆ సౌధం ఎంత కాలం నిలుస్తుంది? ఒక ఆనవాలును చిదిమేసి మరో ఆనవాలును నిట్టనిలువుగా నిలిపితే ఎంతకాలం ఆగుతుంది? గతం గత: అంటే ముందు తరాలు క్షమిస్తాయా? ఆ అబద్ధాల ముసుగును వాళ్లకూ కప్పుదామా?

శ్రావణ్ కుమార్ బొమ్మకంటి

ఎడిటర్

అరె బాబూ.. ప్రపంచం ముందుకు సాగిపోతుంటే.. మనం చరిత్ర అంటూ ఇంకా బట్టలు చింపుకుంటే ఎలా అని ప్రశ్నిస్తారా? అలా ప్రశ్నిస్తే దేశద్రోహం చేసినట్లు కాదా? నిజాన్ని దాచేస్తే నేరం చేసినట్లు కాదా? ఒకటా, రెండా.. ఒక అయోధ్య.. ఒక మథుర.. ఒక భోజ్‌శాల.. ఈ రోజు ఒక సంభల్.. రేపు ఒక తాజ్‌మహల్ కూడా కావొచ్చు. ఎల్లుండి ఇంకేదో కావొచ్చు. తాజ్‌మహల్ అందం ప్రపంచానికి వింత. కానీ.. ఆ అందం నిలబడిన మోకీలు ఎక్కడుందో ప్రపంచానికి తెలియాల్సిన అవసరం లేదా? వాస్తవాలకు యమునా నది తీరాన పిండం పెట్టేద్దామా? ముస్లిం పాలన అంతా విధ్వంసం అని ఎలా అంటారని కొందరు మేధావులు ప్రశ్నిస్తున్నారు. కళ్ల ముందు కనిపించేవే విధ్వంసానికి గురైనట్లు స్పష్టంగా తెలుస్తుంటే.. కనిపించని మారణహోమంపై మాట్లాడగలరా? మాన, ప్రాణాల లెక్కను తేల్చగలరా? ముస్లిం రాజుల పాలన అంతా పరమత ద్వేషంతో నిండిపోకుంటే.. కనిపిస్తున్న ఆలయాలపై గుర్తులు చెదిరిపోయాయెలా? ఆలయాల్లో విగ్రహాలు కూలిపోయాయెలా? ఒక్కో విగ్రహం ముక్కు, చెవులు, చేతులు.. ఇలా అంగాంగం విరగ్గొట్టారంటే ఆ పాలకులు ఎంతటి విద్వేషంతో రగిలిపోయారో అర్థం కావటం లేదా? ఒక విగ్రహాన్నే అంతలా ధ్వంసం చేశారంటే.. ఒక మనిషిని ఎలా కోత కోశారో.. ఒక జాతి నాశనానికి ఎలా పాల్పడ్డారో అర్థం చేసుకోలేమా? ఎక్కడికో ఎందుకు.. రాచకొండ కోటలోని రాళ్లు.. ఓరుగల్లు కోటలోని ఆనవాళ్లు చూపుతాయి అసలు నిజాన్ని. నాటి పాలకుల క్రూరపు స్వభావాన్ని. వేములవాడలో ఒక దర్గా ఎలా వెలిసిందో ఎవ్వరికీ తెలియదు. పల్నాటి వీరుల ఆలయంలో సమాధులు ఎలా వచ్చాయో ఎవ్వరికీ అంతుపట్టదు. అవి మతసామరస్యానికి ప్రతీకలు అని గొప్పగా చెప్పుకోగలం కానీ.. అసలు నిజాన్ని మాత్రం గ్రహించలేం. ఏది నిజం? అని ప్రశ్నిస్తేనే కదా వాస్తవం కొంతైనా తెలిసేది.. వాస్తవ చరిత్ర బోధపడేది.. భవిష్యత్తు తరాలు నిజాన్ని తెలుసుకునేది. చరిత్రలో అన్ని పేజీలకు మరకపట్టి ఉండకపోవచ్చు. వాస్తవంగా చూస్తే మరక అంటింది చరిత్రకే కదా. ఆధునిక భారతావని అంతరిక్షంపై రెపరెపలాడుతోంది. కానీ.. సనాతన భారతం ఆ అంతరిక్షపు అడుగులను ఆనాడే ఆలయాల గోడలపై, గోపురాలపై చెక్కిందన్న వాస్తవాన్ని మరిచిపోదామా? అలాంటిది.. ఒక ఆలయాన్ని కూల్చివేశారంటే.. గొప్ప విజ్ఞానం, శాస్త్ర పరిజ్ఞానం నాశనమైనట్టే కదా. మందిరం అంటే కొందరు మేధావులకు హిందూత్వం, దేవుడి పూజ మాత్రమే గుర్తుకొస్తాయి. కానీ ఆ గుడులను విజ్ఞానపు బడులు అని ఎందుకు గుర్తించరు? అలా గుర్తిస్తే.. ఎంతో అరుదైన సంపదను కోల్పోయామని బోధపడుతుంది కదా.

శ్రావణి వాణి

- విధ్వంసం గురించి ప్రశ్నిస్తే కొందరు విద్వేషం అంటారు..
- మొగలుల పాలనను మాత్రం విద్వేషపూరితమైనదిగా ఎందుకు చూడరు?
- 'ప్రజల మనోభావాలతో రాజకీయ నాయకులు ఆడుతున్న నాటకం' అంటారు..
- మరి ప్రజల మనోభావాలను మాత్రం ఎందుకు గుర్తించరు?
- ముసుగేసుకున్న 'అరుణ' కిరణాలు ఎలాగూ చరిత్ర వెలుగును చూడలేవు.
- విధ్వంసం జరిగింది వాస్తవం.. చరిత్ర వక్రీకరణ జరిగింది వాస్తవం.. మందిరంపై మసీదు వెలిసింది వాస్తవం..
- ఆ వాస్తవాన్ని వాస్తవం అని చెప్పడానికి కొందరు మేధావులకు వాస్తవికత బోధపడటం లేదా? లేక చరిత్రే వద్దనుకొనే మేధావులా వీళ్లు?

ధర్మ పరిరక్షణే ధ్యేయంగా..
సంస్కృతిని కాపాడే లక్ష్యంగా..
మన ఔన్నత్యాన్ని పెంచేలా..
మన ఔచిత్యాన్ని చాటేలా..
తెలుగు చరిత్రలోనే తొలిసారి..
ధర్మం కోసం అక్షర తపస్సు చేస్తూ..
తెలుగు ప్రజల కోసం వస్తున్నది..

"ఋషి తెలుగు దినపత్రిక"

'కురుక్షేత్రం' అన్న పేరుతో..
సంపాదకీయాన్ని తీసుకొస్తున్నది
ఆసక్తి కలిగిన రచయితలు..
ధర్మ పరిరక్షకులు..
ఈ అక్షర యజ్ఞంలో
పాలుపంచుకోవాలని విజ్ఞప్తి.
కురుక్షేత్రం పేజీ కోసం తమ
వ్యాసాలు పంపి
మరింత మందికి జ్ఞానాన్ని
ప్రసాదించాలని వినతి.

కాపాడుకుందాం
మన దేశాన్ని!
మన ధర్మాన్ని!!

గుడికి ఎందుకు వెళ్లాలి?

గుడికి ఎందుకు వెళ్లాలి? అని ఎప్పుడైనా ప్రశ్నించుకున్నారా? కాసేపు కాలక్షేపం కోసమో, మొక్కులు చెల్లించుకోవటానికో అంటే పొరపాటే. గుడికి వెళ్లటం మొక్కుబడి వ్యవహారం కాదు. ఆలయాలను దర్శించుకోవటం వెనుక శాస్త్రీయమైన ప్రయోజనాలు ఉన్నాయి. మనదేశంలో చిన్నాపెద్దా వేల దేవాలయాలు ఉన్నాయి. అయితే అవన్నీ వైదిక దేవాలయాల పరిగణనలోకి రావు. నియమాలను పాటించి నిర్మించిన ఆలయాలను మాత్రమే గురువులు పరిగణిస్తారు. అలాంటివే అత్యంత ప్రసిద్ధి చెందాయి. ఇతర దేవాలయాలు కూడా పవిత్ర ప్రదేశాలే అయినా కొన్ని ఆలయాలు మరింత పునీతమయ్యాయి. స్థల మహత్యాన్ని సంతరించుకున్నాయి.

భూమిలో మహత్తరమైన ఆకర్షణ శక్తి తరంగాలు ఎక్కడ ప్రసరిస్తూ ఉంటాయో అక్కడ ఆలయాన్ని నిర్మించాలి. ఇంకా అర్థమయ్యేలా చెప్పాలంటే ఉత్తర, దక్షిణ ధ్రువాల మధ్య ఎలా ఆకర్షణ శక్తి ఉంటుందో అలా భూమిలో పాజిటివ్ ఎనర్జీ ప్రసరించే చోట ప్రసిద్ధ దేవాలయాలు ఉన్నాయి. అందుకే అలాంటి గుళ్లలో అడుగు పెట్టగానే తనువు, మనసు ప్రశాంతత పొందుతాయి. దేవాలయ గర్భగుడిలో ఉత్ప్రుష్టమైన ఆకర్షణా తరంగాలు కేంద్రీకృతమైన చోట మూలవిరాట్టును నిలిపిన ప్రదేశంలో వేదమంత్రాలు రాసిన తామ్ర పత్రాన్ని (రాగి రేకు) నిక్షిప్తం చేసి ఉంచుతారు. రాగి లోహానికి భూమిలో ఉండే శక్తి తరంగాలను గ్రహించే తత్వం ఉంది. ఆ విధంగా రాగి గ్రహించిన ఆకర్షణను ఆ పరిసర ప్రాంతాలకు విడుదల చేస్తుంది. అందువల్ల రోజూ గుడికి వెళ్లి మూల విరాట్టు ఉన్న గర్భగుడి చుట్టూ ప్రదక్షిణ చేసే అలవాటు ఉన్నవారికి ఆ తరంగాలు సోకి అవి శరీరంలోకి ప్రవహిస్తాయి. ఇక.. గర్భగుడి మూడువైపులా పూర్తిగా మూసి ఉండి, ఒక వైపు మాత్రమే తెరిచి ఉంటుంది. అందువల్ల గర్భాలయంలో, ముఖద్వారం దగ్గర పాజిటివ్ ఎనర్జీ కేంద్రీకృతమై మరీ అధికంగా ఉంటుంది. గర్భగుడిలో వెలిగించే దీపం ఉత్పత్తి చేసే శక్తి కూడా చెప్పుకోదగ్గదే. మూల విరాట్టును ప్రతిష్ఠించిన ప్రదేశం నుండి విడుదలయ్యే మహత్తర శక్తి తరంగాలకు గుడిగంటలు, మంత్ర ఘోష, పూల పరిమళాలు, కర్పూరం, అగరవత్తులు, గంధం, పసుపు, కుంకుమల నుండి వచ్చే అపురూపమైన సుగంధం, తీర్థ ప్రసాదాల్లో ఉండే ఔషధ గుణాలు అన్నీ కలిసి ఎనలేని మేలు జరుగుతుంది.

తీర్థంలో పచ్చ కర్పూరం, యాలకులు, సాంబ్రాణి, తులసి పత్రాలు, లవంగాలు మొదలైనవి కలుపుతారు. ఆయా పదార్థాలు అన్నీ ఔషధ గుణాలు కలిగినవే. ఆ తీర్థాన్ని సేవిస్తే రక్తం శుద్ధి అవుతుంది. ఆయురారోగ్యాలను ఇస్తుంది. ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండేందుకు తోడ్పడుతుంది. ఇప్పుడు చాలామంది పాటించడం లేదు కానీ పూర్వం ఆలయానికి వెళ్లేప్పుడు పురుషులు షర్టు లేకుండా వెళ్లేవారు. దాంతో ఆలయ ప్రాంగణంలో ఉండే శక్తి తరంగాలు వేగంగా పురుషుల శరీరంలో ప్రవేశిస్తాయి. స్త్రీలు నగలు ధరించి వెళ్లేవారు. లోహానికి శక్తి తరంగాలను త్వరితంగా గ్రహించే శక్తి ఉంటుంది. ఆ విధంగా స్త్రీపురుషులిద్దరికీ ప్రయోజనం కలుగుతుంది. గర్భ గుడిలో దీపం నుంచి తీర్థం వరకు అన్నీ శక్తిమంతమైనవేనని శాస్త్రాలు నిరూపిస్తున్నాయి.

- వాన్మయి

OWNED, PUBLISHED AND PRINTED BY **TIRUMALASHETTY RAMACHANDRA RAO**, PRINTED AT VAIBHAV ART PRINTERS, #11-5-419, RED HILLS, LAKADIKAPOOL, HYDERABAD500004, TELANGANA, PUBLISHED AT 6-1-628/4/7, MARKET ROAD, KHIRATABAD, HYDERABAD-4, TELANGANA EDITOR : **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NUMBER: APTEL/2008/26409, CELL: 9666711515, EMAIL: rhushinews@gmail.com